ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
రాజన్న సిరిసిల్ల
3★★★ జిల్లా వార్తలు
ఆదివారం 16 మార్చి 2025



బిల్డింగ్ కాంట్రాక్టర్ల కార్యవర్గం

వేములవాడ, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): వేములవాడ పట్టణ బిల్డింగ్ నిర్మాణ కాంట్రాక్టర్ల సంఘం కార్యవర్గం ఎన్నిక శనివారం నిర్వహించారు. గౌరవ అధ్యక్షులుగా నామాల లక్ష్మీరాజం, నరాల శేఖర్, అధ్యక్షుడుగా నామాల పోశెట్టి, ఉపాధ్యక్షులుగా మర్రిపల్లి మల్లేశం, బింగి మహేష్, రామతీర్థపు రవి, ప్రధాన కార్యదర్శిగా తంగేళ్ల శ్రీనివాస్, సహాయ కార్యదర్శిగా రాపల్లి శ్రీధర్, ప్రచార కార్యదర్శిగా బొల్లం రాజు, కోశాధికారిగా జయారపు గంగయ్య, సలహాదారులుగా కొప్పుల రామ్, పోతారం రమేశ్, మాదాడి సాగర్ రావు, కార్యవర్గ సభ్యులుగా చిలుక అంజయ్య, దర్ర మోహన్, తిరుపతి, భాస్కర్, భూమయ్యలు ఎన్నికయ్యారు.



మార్చిలోనే భగభగ

- జిల్లాలో గరిష్ఠ ఉష్ణోగ్రత 40.2 డిగ్రీలు
- మండుతున్న ఎండలు.. ఆందోళనలో ప్రజలు..
- ప్రత్యామ్నాయ మార్గాల అన్వేషణ

(ఆంధ్రజ్యోతి, సిరిసిల్ల/ఎల్లారెడ్డిపేట)

ఎండలు ముందుగానే సుర్రుమనిపిస్తున్నాయి. వేసవి ప్రారంభంలోనే భానుడు భగ్గుమంటుండడంతో మధ్యాహ్నం వేళల్లో రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలో రోడ్లు నిర్మానుష్యంగా మారుతున్నాయి. శనివారం ఎండ తీవ్రతతో జిల్లా కేంద్రంలోని ప్రధాన జన సంచార ప్రాంతాలు నిర్మానుష్యంగా కనిపించాయి. జిల్లాలో కనిష్ఠ ఉష్ణోగ్రత 18.8 డిగ్రీలు, గరిష్ఠ ఉష్ణోగ్రత 40.5 డిగ్రీలుగా నమోదైంది. తంగళ్లపల్లి మండలంలో గరిష్ఠ ఉష్ణోగ్రత 40.5 డీగ్రీలు నమోదు కాగా, కోనరావుపేట, చందుర్తి, ఇల్లంతకుంట, బోయిన్‌పల్లి మండలాల్లో 40.3 డీగ్రీలు, వేములవాడ రూరల్, వీర్నపల్లి, సిరిసిల్లలో 40.1 డిగ్రీలు, ముస్తాబాద్, వేములవాడ 39.9డిగ్రీలు, గంభీరావుపేట, రుద్రంగిలో 38.7 డీగ్రీలు, ఎల్లారెడ్డిపేటలో 38.5 డీగ్రీలుగా నమోదైంది. ఎండ తీవ్రత రోజురోజుకు పెరుగుతుండడంతో ఈసారి పరిస్థితులు ఇబ్బందికరంగానే ఉంటాయని ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

మట్టికుండలపై ఆసక్తి..

సూర్యుడు ఈసారి ఇప్పుడు మార్చిలోనే భగ్గుమంటుండడంతో ఎండ దాహాన్ని తీర్చుకోవడానికి మట్టి రంజన్లను ఆశ్రయిస్తున్నారు. పేదవాడి ఫ్రిజ్‌గా పేరొందిన ఆదిలాబాద్ రంజన్లకు పోటీగా ఈసారి గుజరాత్ రాజస్థాన్‌ల నుంచి ఎక్కువగా రంజన్లు రాజన్న సిరిసిల్ల జిల్లాకు చేరుకున్నాయి. రాజస్థాన్ నుంచి వచ్చిన రంజన్లకు నల్లాలతో పాటు రకరకాల డిజైన్లు ఉండడం, ధర అందుబాటులోనే ఉన్నాయి. సిరామిక్ రంజన్లు నీటి చల్లదనం ఎక్కువగా ఉంటుందని భావించి కొనుగోలు చేస్తున్నారు.

పండ్లు, శీతలపానీయాలకు డిమాండ్..

మార్చి మాసంలోనే మండే ఎండలకు జనం విలవిల్లాడుతున్నారు. ఎండ తీవ్రత నుంచి రక్షించుకునేందుకు పండ్లు, శీతల పానీయాలను ఆశ్రయిస్తున్నారు. వేడిమి నుంచి రక్షించుకునేందుకు తంటాలు పడుతున్నారు. ఎండ తాపాన్ని తట్టుకునేందుకు ఆయా గ్రామాల ప్రజలు ముందస్తు జాగ్రత్తలు పాటిస్తున్నారు. చల్లని నీటి కోసం ఇళ్లలో నీటి బాటిళ్లను ఫ్రిజ్‌లో పెడుతున్నారు. తలకు టోపీలు, ముఖానికి తెల్లని చేతి రుమాళ్లు కట్టుకోవడం, మహిళలు ముఖానికి చేతులను కప్పే దుస్తులు ధరించకుండా బయటకు వెళ్లడం లేదు. ప్రజలు నీడ, చల్లని గాలి, శీతల పానీయాల కోసం వెతుకుతున్నారు. పట్టణాలతో పాటు గ్రామాల్లో శీతలపానీయాలు, కొబ్బరి బొండాలు దుకాణాలు వెలిశాయి. ప్రజలు, వాహనదారులు ఎండ తీవ్రత నుంచి ఉపశమనం పొందేందుకు శీతల పానీయాలు, కొబ్బరి బొండాల దుకాణాల వద్దకు చేరుకుంటున్నారు. చల్లదనం ఇచ్చే పుచ్చకాయలు, కొబ్బరి బొండాలు, దోసకాయలు, పండ్ల రసాలు, శీతల పానీయాలు, ఐస్‌క్రీంలకు గిరాకీ భలే పెరిగింది. ఖర్చులకు వెరవకుండా వేసవిలో సేదదీరడానికి అందుబాటులో ఉండే సదుపాయాలను సమకూర్చుకునేందుకు సిద్ధమవుతున్నారు.

బయటికి వెళితే జాగ్రత్త..

ప్రదీప్, సీహెచ్‌సీ ఇన్‌చార్జి వైద్యుడు, ఎల్లారెడ్డిపేట



ఎండలో ఎక్కువసేపు పనిచేయకూడదు. ఒకవేళ తప్పనిసరైతే ఎక్కువ నీటిని తాగాలి. నెత్తిన టోపీ ధరించాలి. వృద్ధులు, వ్యాధిగ్రస్తులు ఎండలో తిరిగేటప్పుడు పూర్తిస్థాయిలో జాగ్రత్తలు పాటించాల్సిన అవసరం ఉంది. ఒత్తిడికి గురి కాకుండా పని చేయాలి. వడదెబ్బ బారిన పడినవారు గ్లూకోజ్, ఎలక్ట్రాల్ ఓఆర్ఎస్‌ను నీటిలో కలిపి తరచూ తాగాలి. పండ్ల రసాలు తీసుకోవాలి. ప్రాథమిక చికిత్సలో భాగంగా చల్లని నీటితో శరీరాన్ని తుడవడం, చిటికెడు ఉప్పు, చెంచా పంచదార కలిపిన నీటిని తాగి దగ్గరలోని ఆసుపత్రిని సంప్రదించాలి.



సాయంత్రం వేళల్లో నిర్మానుష్యంగా ఉన్న హైదరాబాద్ రోడ్



ఎండ వేడిమికి శీతలపానీయాలు తాగుతున్న యువకులు(ఫైల్)



హలీం.. సలాం

- సర్వజనులకు ఎంతో ప్రియం..
- రంజాన్ మాసం.. నోరూరించే రుచులు
- అరబ్ దేశాల నుంచి తెలంగాణకు..
- జిల్లా ప్రధాన కూడళ్లలో ప్రత్యేక స్టాళ్లు
- ఆదివారం ప్రత్యేకం

రంజాన్ మాసంలో హలీమ్ ఘుమఘుమ లు నోరూరిస్తాయి. ముస్లింలతో పాటు అన్ని వర్గాల వారికి హలీమ్‌ను ఎంతో ప్రియంగా భావిస్తారు. పవిత్ర రంజాన్ మాసం ప్రారంభం నుంచే హలీమ్ రుచులతో పాటు చికెన్ మంచూరియా, చికెన్ కర్రీ, తందూరి చికెన్, డబుల్‌కా మీఠా, రుమాల్ రోటి వంటి రుచులను నిర్వాహకులు అందిస్తున్నారు. ఒకప్పుడు హైదరాబాద్‌కే పరిమితమైన హలీమ్ ఇప్పుడు చిన్నచిన్న నగరాల్లో సైతం లభిస్తోంది. ఇప్పటికీ రుచికరమైన హలీమ్‌కు మన హైదరాబాదే ప్రసిద్ధిగాంచింది. రుచుల పరంగా కాకుండా కేలరీల పరంగా కూడా హలీమ్ ఎంతో ముఖ్యంగా చెప్పుకుంటారు. రోజా రోజుల్లో అందే రుచుల్లో ముఖ్యంగా ఉండేది హలీమ్. ప్రజల ఆహార అలవాట్లకు అనుగుణంగానే హలీమ్‌ను కూడా రకరకాల వెరైటీలతో హోటల్ యజమానులు తయారుచేస్తున్నారు. ప్రస్తుతం దేశవ్యాప్తంగా హరీస్, హలీమ్ వంటకాలు ప్రసిద్ధి చెందాయి.

- ఆంధ్రజ్యోతి, సిరిసిల్ల

5





విద్యుత్ దీపాల అలంకరణలో రాజన్న ఆలయం

నేటి నుంచి శివ కల్యాణోత్సవం

- రాజన్న ఆలయంలో ఐదు రోజుల పాటు నిర్వహణ

5

కరాటేలో రాణిస్తున్న దుమాల విద్యార్థినులు..

- రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీల్లో పతకాలు..

6



కరాటేలో సాధన చేస్తున్న విద్యార్థినులు

అక్రమ బెట్టింగ్ యాప్స్‌ను ప్రోత్సహిస్తే కఠిన చర్యలు

- ఎస్పీ మహేశ్ బి. గితే

సిరిసిల్ల క్రైం, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): అక్రమ బెట్టింగ్ యాప్స్‌ను ప్రోత్సహిస్తే కఠిన చర్యలు తప్పవని ఎస్పీ మహేశ్ బి. గితే ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆన్‌లైన్ గేమింగ్ యాప్‌లలో గేమ్స్ ఆడినా ప్రోత్సహించినా చర్యలు తీసుకుంటామన్నారు. సోషల్ మీడియా వేదికగా ఆన్‌లైన్ బెట్టింగ్, గేమింగ్ యాప్స్‌లను ప్రమోట్ చేసేవారి సమాచారం అందించాలన్నారు. తక్కువ సమయంలో ఎక్కువ డబ్బులు సంపాదించవచ్చనే భ్రమలో యువత, విద్యార్థులు బెట్టింగ్ యాప్స్‌నకు బానిసలుగా మారుతున్నారన్నారు. గేమింగ్ యాప్‌లు ప్రమోట్ చేసిన వ్యక్తులపై కేసులు నమోదుచేస్తున్నామన్నారు. బెట్టింగ్ యాప్‌లలో డబ్బులు పెట్టుబడిగా పెట్టి ప్రాణాల మీదకు తెచ్చుకోవద్దన్నారు. ఆన్‌లైన్ గేమింగ్ మాటున ప్రమాదం పొంచి ఉందన్నారు. ఫెక్ లింక్స్‌తో వ్యక్తిగత సమాచారం, అకౌంట్ వివరాలు తెలుసుకునే అవకాశం ఉన్నందున గేమింగ్ యాప్‌ల పట్ల అప్రమత్తంగా ఉండాలని ఆయన పేర్కొన్నారు. ఈ అక్రమ బెట్టింగ్ యాప్‌లను సోషల్ మీడి యా వేదికగా ప్రచారం చేసే ఎవరిపైనా ఉపేక్షించేది లేదన్నారు. ప్రజలు, యువత అప్రమత్తంగా ఉండి ఇటువంటి కార్యకలాపాలపై వెంటనే పోలీస్ వారికి సమాచారం అందిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. జిల్లాలో సోషల్ మీడియా బాధ్యులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలన్నారు. అక్రమ బెట్టింగ్ యాప్‌లకు సంబంధించి ప్రచారాన్ని చేయవద్దని, ఆన్‌లైన్ బెట్టింగ్, ఆన్‌లైన్ గేమ్స్ వలన కలిగే పరిణామాలపై అవగాహన కల్పించాలన్నారు.

న్యాయవాదుల్లో ఎన్నికల సందడి

సిరిసిల్ల క్రైం, మార్చి 16(ఆంధ్రజ్యోతి): జిల్లాలో 2025-26 సంవత్సరానికి న్యాయవాదుల ఎన్నికల సందడి నెలకొంది. ఈ మేరకు రాష్ట్ర బార్ కౌన్సిల్ చైర్మన్ నర్సింహారెడ్డి ఎన్నికల షెడ్యూల్‌ను శనివారం విడుదల చేశారు. ఈనెల 27న ఎన్నికలు నిర్వహించేందుకు ఏర్పాట్లుచేయాలని బార్ అసోసియేషన్‌లకు ఆదేశాలు జారీ అయ్యాయి. ఇందుకు ఆశావహులు ఇప్పటినుంచే ప్రయత్నాలు ముమ్మరం చేశారు. జిల్లాలోని సిరిసిల్ల, వేములవాడ బార్ అసోసియేషన్‌లలో సభ్యత్వం తీసుకొని సంబంధిత బార్ అసోసియేషన్‌లో సీవోపీ కలిగి ఉన్న న్యాయవాదుల ఓటర్ల జాబితాలను బార్ అసోసియేషన్‌లకు బార్ కౌన్సిల్ పంపించింది. ఈ ఓటర్ల జాబితాను విడుదల చేశారు. దీంతో వేములవాడలో 103 మంది, సిరిసిల్లలో 181మంది న్యాయవాదులకు ఓటు హక్కు కల్పించింది. సిరిసిల్ల, వేములవాడ బార్ అసోసియేషన్ ఎన్నికల్లో భాగంగా ఈనెల 17నుంచి 20వరకు నామినేషన్‌లు స్వీకరణ, 21న నామినేషన్‌ల పరిశీలన, ఈనెల 22న నామినేషన్ల ఉపసంహరణ, అభ్యర్థుల జాబితా విడుదల చేయాలని బార్ కౌన్సిల్ షెడ్యూల్‌లో పేర్కొంది. ఈ షెడ్యూలు ప్రకారం ఈనెల 22నుంచి 26వరకు ప్రచార సరళిని నిర్ణయించారు. ఈనెల 27న ఉదయం 10గంటల నుంచి 2గంటల వరకు పోలింగ్, మధ్యాహ్నం 3గంటలకు కౌంటింగ్ అనంతరం ఫలితాలు ప్రకటిస్తారు. సిరిసిల్ల, వేములవాడ బార్ అసోసియేషన్‌లు ఎన్నికల అధికారి ఎంపికకు జనరల్ బాడీ సమావేశం ఈనెల 20న ఏర్పాటుచేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు. దీంతో బార్ అసోసియేషన్‌లో ఎన్నికల వాతావరణం ఏర్పడింది.

ఉపాధి కూలీలకు ప్రభుత్వం అండగా ఉండాలి : సీపీఐ

ఇల్లంతకుంట, మార్చి 15 (ఆంధ్రజ్యోతి) : ఉపాధిహామీ పథకం కూలీలకు ప్రభుత్వం అండగా ఉండాలని సీపీఐ జిల్లా కార్యదర్శి గుంటి వేణు పేర్కొన్నారు. మండలంలోని పొత్తూరు గ్రామంలో శనివారం సీపీఐ సమావేశం జరిగింది. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ దరఖాస్తు చేసుకున్న కూలీలందరికి ఉపాధిహామీ జాబ్‌కార్డులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం 10కోట్ల మంది ఉపాధిహామీ కార్మికులకు రూ.2లక్షల కోట్లు కేటాయించవలసి ఉండగా కేవలం 80వేల కోట్లను కేటాయించిందని విమర్శించారు. ఏప్రిల్ 9న మండలకేంద్రంలో జరిగే మహాసభకు మాజీ ఎమ్మెల్యే చాడ వెంకటరెడ్డి హాజరవుతున్నందున అన్ని గ్రామాల నాయకులు విజయవంతం చేయాలన్నారు. పెద్దలింగాపూర్ గ్రామసమీపంలో రైతులు నిరాహారదీక్ష చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోకపోవడం బాధాకరమన్నారు. సమావేశంలో దళిత హక్కుల పోరాటసమితి జిల్లా కార్యదర్శి మంద సుదర్శన్, రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు తీపిరెడ్డి తిరుపతిరెడ్డి, ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి మంద అనిల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

లింగన్నపేట బ్రిడ్జి నిర్మాణ పనులు చేపట్టాలి

అఖిల పక్ష నాయకుల ఆధ్వర్యంలో నిరసన దీక్ష



ధర్నా చేస్తున్న అఖిల పక్షం నాయకులు

గంభీరావుపేట, మార్చి 15 (ఆంధ్రజ్యోతి) గంభీరావుపేట- లింగన్నపేట గ్రామాల మధ్య మానేరు వాగుపై హై లెవల్ బ్రిడ్జిని వెంటనే నిర్మించాలని అఖిల పక్షంలో ఆధ్వర్యంలో నాయకులు శనివారం ధర్నా, నిరసన దీక్ష చేపట్టారు. హై లెవల్ బ్రిడ్జి నిర్మాణంలో తీవ్ర జాప్యం జరుగుతోందని ఆరోపిస్తూ లింగన్నపేట మానేరు వాగు వద్ద బైఠాయించారు. లింగన్నపేట బ్రిడ్జి నిర్మాణం కోసం గత ప్రభుత్వ హయాంలోనే రూ. 17 కోట్లు నిధులు మంజూరు కాగా, తరువాత నిధులు కుదించినప్పటికి పనులు మాత్రం మొదలవ్వడం లేదని వాపోయారు. కొత్త బ్రిడ్జి కోసం ఆఘమేఘాల మీద పాత లోలెవల్ బ్రిడ్జిని కూల్చివేసి, తాత్కాలికంగా మట్టి రోడ్డు వేశారని, కానీ 15 నెలలు గడుస్తున్నా కాంట్రాక్టర్ పనులు మొదలు పెట్టలేదన్నారు. మళ్లీ వర్షాకాలం వస్తే తాత్కాలికంగా వేసిన మట్టి రోడ్డు కాస్త కొట్టుకుపోయే ప్రమాదం ఉందన్నారు. వర్షాకాలం రాకముందే కొత్త బ్రిడ్జి నిర్మాణ పనులు పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. ఇప్పటికే హై లెవల్ బ్రిడ్జి కోసం ఆందోళనలు, ధర్నాలు చేపట్టిన పాలకులు, అధికారులు పట్టించుకోవడం లేదని వెల్లడించారు. బ్రిడ్జి నిర్మాణం పనులు తొందరగా చేపట్టకుంటే దశల వారీగా ఉద్యమాలు చేపట్టి, ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో శివసేన జిల్లా ఇంచార్జీ గౌటే గణేష్, బీజేవైఎం జిల్లా ఉపాధ్యక్షుడు పెద్దూరు పర్శాగౌడ్, బీజేపీ రాష్ట్ర నాయకులు దేవేందర్ యాదవ్, మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు దోసల చంద్రం, గ్రామ పురోహితులు పార్థసారది శర్మ, రాజుపేట మాజీ సర్పంచ్ అల్లె సత్యం, నాయకులు కృష్ణకాంత్, ప్రవీణ్, శ్రావణ్ మహిళలు ఉన్నారు.

మహిళా కాంగ్రెస్ బలోపేతానికి కృషి

- జిల్లా ఇన్‌చార్జి, రాష్ట్ర ఉపాధ్యక్షురాలు సుగుణ

సిరిసిల్ల టౌన్, మార్చి 15 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో కాంగ్రెస్ మహిళ విభాగాన్ని మరింత బలోపేతం చేయాలని కాంగ్రెస్ మహిళ జిల్లా ఇంచార్జి, రాష్ట్ర ఉపాధ్యక్షురాలు సుగుణ అన్నారు. శనివారం సిరిసిల్ల పట్టణం జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మహిళ జిల్లా అధ్యక్షురాలు కాముని వనిత అధ్యక్షతన సభ్యత్వ నమోదు కార్యక్రమంపై జిల్లా స్థాయి సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కాంగ్రెస్ మహిళ జిలా ఇంచార్జి సుగుణ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గోవిందమ్మ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి సుమలత, మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ వెల్ముల స్వరూపతిరుపతిరెడ్డి, బొప్పాపూర్ మార్కెట్ కమిటి చైర్ పర్సన్ షేక్ సాబేరా బేగం, బ్లాక్ అధ్యక్షురాలు రమాదేవి, జిల్లా ప్రధాన కార్యదర్శి కోడం అరుణ, మాజీ కౌన్సిలర్ మడుపు శ్రీదేవి, సభ్యులు సుధా, రోజా, లత, హారికారెడ్డి, వనిత, సానియా, పట్టణ, మండలాల అధ్యక్షులు, కార్యదర్శులు, గ్రామ అధ్యక్ష, కార్యదర్శులు పాల్గొన్నారు.

ఘనంగా గౌరి పూర్ణిమ మహోత్సవం



కార్యక్రమానికి హాజరైన భక్తులు

తంగళ్లపల్లి, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ కృష్ణ చైతన్య సంఘం ఆధ్వర్యంలో గౌరి పూర్ణిమ(హోలీ) వేడుకలు కన్నుల పండువగా జరిగాయి. శ్రీ కృష్ణ చైతన్య మహాప్రభు ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా శుక్రవారం తంగళ్లపల్లి మండలం నేరెళ్ల గ్రామశివారులోని ఇస్కాన్‌ఫాంలో మహోత్సవం నిర్వహించారు. దీంట్లో భాగంగా శ్రీకృష్ణ బలరాములకు 16రకాల పండ్ల రసాలతో పంచామృతం, గంగాజలాలతో ఘనంగా మహా అభిషేకం నిర్వహించారు. అలాగే శోడషోపచార పూజలు, నాటక ప్రదర్శన, ఆధ్యాత్మిక ప్రవచనలు నిర్వహించి భక్తులకు అన్న ప్రసాదం అందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఇస్కాన్ హరే రామ హరే కృష్ణ ఇన్‌చార్జి ప్రాణదాత అచ్చుతానందదాస్, రాధాకృష్ణదాస్, భక్త శ్రీరామ్, భక్త అజయ్, కోడం అశోక్, మంగళరాపు ప్రభాకర్, ఆడెపు శ్రీహరి, ఆడెపు రవీందర్, ఎల్లె లక్ష్మీనారాయణ, సంగీతం శ్రీనివాస్, అన్నల్‌దాస్ అనిల్ పాల్గొన్నారు.

ఆత్మీయ సమ్మేళనాన్ని విజయవంతం చేయాలి

వేములవాడ రూరల్, మార్చి15 (ఆంధ్రజ్యోతి): సిరిసిల్లలో ఆదివారం జరిగే బీజేపీ ఆత్మీయ సమ్మేళనాన్ని విజయవంతం చేయాలని సీనియర్ నాయకుడు జక్కుల తిరుపతి అన్నారు. ప్రతీ గ్రామం నుంచి కార్యకర్తలు పెద్దఎత్తున హాజరవ్వాలని పిలుపునిచ్చారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు రెడ్డబోయిన గోపి, జిల్లా మాజీ అధ్యక్షుడు ప్రతాప రామకృష్ణను మర్యాద పూర్వకంగా కలిసి సన్మానించారు. కార్యక్రమంలో పలువులు నాయకులు పాల్గొన్నారు.

సీఎం, స్పీకర్, మంత్రుల చిత్రపటాలకు క్షీరాభిషేకం



క్షీరాభిషేకం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

సిరిసిల్ల టౌన్, మార్చి 15 (ఆంధ్రజ్యోతి) : బీఆర్ఎస్ పార్టీ అంటేనే దళిత వ్యతిరేక పార్టీ అని, తెలంగాణ శాసన సభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌ను శాసన సభలో బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యే జగదీశ్వర్‌రెడ్డి అవమానించారని గ్రంథాలయం జిల్లా చైర్మన్ నాగుల సత్యనారాయణ అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను బీఆర్ఎస్ పార్టీ నాయకులు దహనం చేయడాన్ని ఖండిస్తూ శనివారం సిరిసిల్ల పట్టణం అంబేద్కర్ చౌరస్తా వద్ద ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, స్పీకర్ గడ్డం ప్రసాద్, మంత్రులు శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ఉన్న చిత్రపటానికి కాంగ్రెస్ నాయకులు క్షీరాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు సూర దేవరాజు,చేనేత సెల్ జిల్లా అధ్యక్షుడు గోనె ఎల్లప్ప, మార్కెట్ కమిటి డైరెక్టర్లు ఎండీ ఖాజా, వెంకటేశం, కాసర్ల రాజు, మాజీ కౌన్సిలర్లు యెల్లె లక్ష్మినారాయణ, కత్తెర దేవదాస్, రాగుల జగన్, నాయకులు రంగ కిషన్, గుండ్లపెల్లి గౌతమ్, యాదగిరి పాల్గొన్నారు.

- ఎల్లారెడ్డిపేట : మండల కేంద్రంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చిత్రపటానికి కాంగ్రెస్ పార్టీ నాయకులు శనివారం క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్‌పర్సన్ సబేరాబేగం, నాయకులు నర్సయ్య, లక్ష్మారెడ్డి, రాంరెడ్డి, రాజేందర్, చిన్న లక్ష్మీ, శ్రీనివాస్‌రెడ్డి, గౌస్, బుచ్చాగౌడ్, శ్రీనివాస్, రాములు, కిషన్, భూపాల్‌రెడ్డి, బాలయ్య, తిరుపతిరెడ్డి, రాజయ్య, ఎల్లాగౌడ్, ఇమామ్ తదితరులు పాల్గొన్నారు.
- ముస్తాబాద్ : బీఆర్ఎస్ పార్టీ అంటేనే దళిత వ్యతిరేక పార్టీ అని ముస్తాబాద్ మండల కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు యెల్ల బాల్‌రెడ్డి పేర్కొన్నారు. ముస్తాబాద్ మండల కేంద్రంలో రాజీవ్ కూడలిలో సీఎం రేవందర్‌రెడ్డి చిత్రపటానాకి క్షీరాభిషేకం చేశారు.

ఈ కార్యక్రమంలో నాయకుల గజ్జెల రాజు, భాను, కొండం రాజిరెడ్డి, మహేందర్, శ్రీనివాస్, బాల్‌రెడ్డి, గుండెల్లి శ్రీనివాస్, నరేశ్,దశరథం, సత్తయ్య, అంజనేయులు, నర్సింలు తదితరులు పాల్గొన్నారు.

హోలీలో హుషారుగా.. కాసేపటికే గుండెపోటు

● ఆసుపత్రికి తరలించేలోపే మహిళ మృతి


జ్యోతి(ఫైల్)

మల్యాల, మార్చి 15(ఆంధ్రజ్యోతి): తోటి మహిళలతో హుషారుగా హోలీ వేడుకల్లో పాల్గొని వారితో కలిసి సంబరాలు చేసుకొని ఇంటికి వెళ్లిన ఓమహిళ కాసేపటికే గుండెపోటుతో మృతి చెందడం విషాదంగా మారింది. ఆడుతూ.. పాడుతూ తమతో ఉన్న మహిళ గంటల వ్యవధిలోనే మృతిచెందడం తోటివారిని కంటతడి పెట్టించింది. వివరాలు ఇలా ఉన్నాయి. మల్యాల మండలం రామన్నపేటకు చెందిన సిరిమల్ల జ్యోతి అలియాస్ రమ(40) అనే మహిళ హోలీ పండగ సందర్భంగా శుక్రవారం రాత్రి తోటిమహిళలతో కలిసి రాత్రి11గంటలవరకు వేడుకల్లో పాల్గొని తరువాత ఇంటికి వెళ్లింది. భోజనం చేసి పడుకున్న కాసేపటికే చాతిలో నొప్పి అని తెలపడంతో కుటుంబసభ్యులు చికిత్స కోసం జగిత్యాల ఆసుపత్రికి తరలిస్తుండగానే మార్గమధ్యంలో మృతి చెందింది. దీంతో కుటుంబంలో, గ్రామంలో విషాదం నెలకొంది. మృతురాలికి ఇద్దరు కుమారులు ఉన్నారు.

హోలీ వేడుకలో విషాదం

● స్నానానికి వెళ్లి చెరువులో పడి వ్యక్తి మృతి

ముత్తారం, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని లక్కారం గ్రామంలో హోలీ వేడుకలో విషాదం నెలకొంది. గ్రామానికి చెందిన ముదురుకోళ్ల సమ్మయ్య (45)శుక్రవారం హోలీ అనంతరం స్నానం చేయడానికి లక్కారం చెరువు వద్దకు వెళ్ళి ప్రమాదవశాత్తు అందులో పడి మృతి చెందాడు. హోలీరోజు గ్రామంలో పలువురి వద్ద డబ్బులు అడుక్కొని మద్యం సేవించి స్నానం చేయడానికి వెళ్లి చెరువులో పడి మృతి చెందినట్లు తెలిపారు. మృతుడి తండ్రి కొమురయ్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ నరేష్ తెలిపారు.

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరి మృతి

కరీంనగర్ క్రైం, మార్చి 15(ఆంధ్రజ్యోతి): కరీంనగర్ జిల్లా కొత్తపల్లి మండలం రెడ్డిరామయ్యపల్లి స్టేజీ వద్ద శుక్రవారం అర్ధరాత్రి రోడ్డు ప్రమాదంలో రామడుగుమండలం వెదిర గ్రామానికి చెందిన మల్యాల సత్తయ్య(55) మృతిచెందాడు. పోలీసుల వివరాలప్రకారం.. మల్యాల సత్తయ్య రాత్రి 11:30 గంటలకు వెదిర నుంచి కరీంనగర్‌కు బైక్‌పై వస్తున్నాడు. రెడ్డిరామయ్యపల్లి స్టేజీవద్ద ఎదురుగా వచ్చిన బైక్ అతివేగంగా ఢీకొట్టింది. సత్తయ్య ఎగిరిరోడ్డుపై పడడంతో తీవ్రగాయాలతో అక్కడికక్కడే మృతి చెందాడు. సత్తయ్య భార్య ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

కొత్తపల్లి మెడికల్ కళాశాల వద్ద..

కరీంనగర్ క్రైం, మార్చి 15(ఆంధ్రజ్యోతి): కొత్తపల్లి మెడికల్ కళాశాల వద్ద శనివారం మధ్యాహ్నం జరిగిన రోడ్డు ప్రమాదంలో రేకుర్తికి చెందిన సుతారి అక్కపెల్లి భూమయ్య(48) అక్కడికక్కడే మృతి చెందాడు. కొత్తపల్లి పోలీసుల వివరాల ప్రకారం.. భూమయ్య తన ద్విచక్రవాహనంపై రేకుర్తికి వస్తున్నాడు. మధ్యాహ్నం 2:30 గంటల సమయంలో జగిత్యాల నుంచి కరీంనగర్‌కు వస్తున్న కారు అతివేగంగా భూమయ్య బైక్‌ను వెనుకవైపు నుంచి ఢీకొట్టింది. దీంతో తీవ్రంగా గాయపడిన భూమయ్య మృతి చెందాడు. భూమయ్య భార్య ఫిర్యాదుతో కారు డ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి మృతి

కరీంనగర్ క్రైం, మార్చి 15(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఉత్తరప్రదేశ్ రాష్ట్రం గోరఖ్‌పూర్‌కు చెందిన రాజేష్‌గుప్తా(28) అనేవ్యక్తి పరిస్థితి విషమించి శనివారం మృతిచెందాడు. కరీంనగర్‌రూరల్ పోలీసుల వివరాల ప్రకారం.. రాజేష్‌గుప్తా రెండేళ్లుగా నగరంలోని కిసాన్‌నగర్‌లో నివాసం ఉంటూ కార్పెంటర్ వద్ద పనిచేస్తున్నాడు. శుక్రవారం మధ్యాహ్నం బైక్‌పై కరీంనగర్ నుంచి వల్లంపహాడ్ గ్రామానికి వెళ్తున్నాడు. తీగలగుట్టపల్లి వద్ద కుక్కను తప్పించబోయి బైక్ అదుపుతప్పి రోడ్డు పక్కన చెట్టును ఢీకొంది. దీంతో రాజేష్‌గుప్తకు తీవ్రగాయాలయ్యాయి. వెంటనే ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తుండగా మృతిచెందాడు. రాజేష్ గుప్తా బంధువు ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

లారీ ఢీకొని ఐకేపీ ఉద్యోగి మృతి


కుమారస్వామిగౌడ్(ఫైల్)

అంతర్గాం, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని బ్రాహ్మణపల్లి ఎక్స్‌రోడ్డు వద్ద లారీఢీకొని ఐకేపీ ఉద్యోగి మేరుగు కుమార స్వామి గౌడ్ మృతిచెందాడు. పెద్దంపేట గ్రామానికి చెందిన మేరుగు కుమార స్వామిగౌడ్(43) ద్విచక్రవాహనం టీఎస్ 02ఈఈ 0265పై పాలకుర్తి మండలానికి విధులకు వెళుతున్నాడు. బసంతనగర్ నుంచి అంతర్గాం వైపు వేగంగా వెళుతున్న ఏపీ20టీబీ5994 నంబర్‌గల లారీ బ్రాహ్మణపల్లి మూలమలుపు వద్ద ఢీకొట్టడంతో కుమారస్వామికి తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతిచెందాడు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటనస్థలాన్ని సందర్శించి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గోదావరిఖనిలోని ప్రభుత్వ ఏరియాఆసుపత్రికి తరలించారు. మృతుడికి భార్య శైలజ, కూతురు, కుమారుడు ఉన్నారు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేపడుతున్నట్టు ఎస్ఐ వెంకటస్వామి తెలిపారు. మృతుడి కుటుంబానికి కోటి రూపాయల నష్ట పరిహారం చెల్లించి న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ బీఆర్ఎస్ నాయకుడు కౌశిక హరి, పెద్దంపేట గ్రామస్థులు రాస్తారోకో నిర్వహించారు. సంఘటన స్థలాన్ని సందర్శించిన బీజేపీ రామగుండం ఇన్‌చార్జి కందుల సంధ్యారాణి, న్యూడెమోక్రసీ నాయకులు కొల్లూరి మల్లేష్, మేరుగు చంద్రయ్యలు మృతుడి కుటుంబీకులను ఓదార్చారు.

రైలు ఎక్కబోతూ రైల్వే ఉద్యోగి మృతి

జమ్మికుంట రూరల్, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): జమ్మికుంట రైల్వే స్టేషన్లో దానాపూర్ ఎక్స్‌ప్రెస్ రైలు ఎక్కబోతూ ప్రమాదవశాత్తు జారిపడి కొంరయ్య అనే రైల్వే ఉద్యోగి శనివారం మృత్యువాతపడ్డాడు. హన్మకొండ జిల్లా ధర్మసాగర్ మండలం సోమిడి గ్రామానికి చెందిన కొంరయ్య బిజిగిరిషరీఫ్ రైల్వేస్టేషన్ పరిధిలో గ్యాంగ్‌మేన్ విధులు నిర్వర్తిస్తున్నాడు. విధులు ముగించుకొని రైలు ఎక్కేందుకు జమ్మికుంటకు వచ్చాడు. దానాపూర్ ఎక్స్‌ప్రెస్ జనరల్‌బోగిలో ఎక్కుతున్న క్రమంలో కాలుజారి ప్లాట్‌ఫామ్ మీద పడి అక్కడికి అక్కడే మృతి చెందాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రైల్వే హెడ్ కానిస్టేబుల్ గంగారపు తిరుపతి తెలిపారు.

ఎన్టీపీసీలో యువకుడి ఆత్మహత్య

జ్యోతినగర్, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): ఎన్టీపీసీ పోలీస్ స్టేషన్ పరిధిలోని అన్నపూర్ణకాలనీలో శనివారం దయా ప్రసన్నకుమార్(29) అనే యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. ఇంట్లో ఎవరూ లేని సమయంలో సీలింగ్ ఫ్యానుకు వైరుతో ఉరివేసుకొని బలవన్మరణానికి పాల్పడ్డాడు. వ్యక్తిగత కారణాల వల్లనే జీవితంపై విరక్తి చెంది ఆత్మహత్యకు పాల్పడినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. మృతుడి సోదరుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎన్టీపీసీ ఎస్ఐ ఉదయ్ కిరణ్ తెలిపారు.

దివ్యాంగులకు యూడీఐడీ స్మార్ట్‌కార్డులు

● అర్హులకు సంక్షేమ పథకాలు అందించేందుకు చర్యలు
● వన్‌నేషన్, వన్‌డిసెబులిటీపై కేంద్రం కసరత్తు



సుభాష్‌నగర్, మార్చి11(ఆంధ్రజ్యోతి): వన్‌నేషన్, వన్ డిసెబులిటీలో భాగంగా దేశంలోని వికలాంగులందరికీ ఒకే రకమైన కార్డులు అందించేందుకు కేంద్ర ప్రభుత్వం యూడీఐడీ కార్డులను ప్రవేశపెట్టింది. ప్రస్తుతం వైకల్య నిర్ధారణకు సదరం సర్టిఫికెట్ ఇస్తున్నారు. దానికి కూడా కాలపరిమితి ఉటుంది. ఈ సమస్యలేవి లేకుండా యూడీఐడీ (యూనిక్ డిసెబిలిటీ ఐడీ) నంబరును కేటాయించి స్మార్టు కార్డులు జారీ చేయనున్నారు. ఇందుకు ప్రత్యేకంగా పోర్టల్‌ను ప్రారంభించి దివ్యాంగులే నేరుగా దరఖాస్తు చేసుకునే అవకాశం కల్పించింది. సమగ్ర వివరాలతో పాటు పాస్‌పోర్టు సైజు ఫొటో, సంతకం లేదా ఆదార్ కార్డు తదితర గుర్తింపు కార్డులను పోర్టల్‌లో అప్‌లోడ్ చేసి సదరం శిబిరం నిర్వహించే కేంద్రాల్లో దగ్గర ఉండే దానిని ఎంచుకోవాలి. అక్కడ ఏ రోజు సదరం నిర్వహిస్తారో మొబైల్ ఫోనుకు మెసేజ్ పంపిస్తారు. అక్కడికి వెళ్తే డాక్టర్లు వారి వైకల్యాన్ని నిర్ధారించి ఎంత శాతం ఉందనేది పోర్టల్‌లో నమోదు చేస్తారు. కొత్తవారితో పాటు ఇప్పటికే సదరం సర్టిఫికెట్ పొందిన వారికి కూడా స్మార్టు కార్డులు జారీ చేస్తారు. స్మార్ట్ కార్డుల కోసం మీసేవా కేంద్రాల్లో స్లాట్ బుక్ చేసుకొని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో నిర్వహించే సదరం శిబిరానికి హాజరు కావాల్సి ఉంటుంది. వివరాలన్నీ సరిగ్గా ఉన్నాయని డాక్టర్లు నిర్ధారించి స్మార్ట్ కార్డు మంజూరు చేస్తారు. డిజిటల్ సంతకంతో కూడిన స్మార్ట్ కార్డు పోస్టు ద్వారా దివ్యాంగుడి ఇంటి అడ్రస్‌కు పంపిస్తారు. కార్డులో ఐడీ నంబరు, దివ్యాంగుడి పేరు, వైకల్యం రకం, ఎంతశాతం ఉంది అనే వివరాలు అందులో ఉంటాయి.

● కార్డుతో బహుళ ప్రయోజనాలు

కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న యూడీఐడీ కార్డుతో బహుళ ప్రయోజనాలు ఉన్నాయి. సదరం శిబిరంలో వికలాంగత్వం నిర్ధారణ అయిన తర్వాత అర్హులైన వారికి అధికారులు కార్డు మంజూరు చేస్తారు. ఈ కార్డు ఆధార్‌తో లింక్ చేయబడి ఉండటంతో వికలాంగులకు కేంద్రం అందించే సంక్షేమ పథకాలు ఏ మేరకు అందుతున్నాయే పరిశీలించే అవకాశం ఉంటుంది. ఈ కార్డు బస్సులు, రైళ్ల టికెట్లపై రాయితీలు, పింఛన్ వంటి ప్రయోజనాలు పొందవచ్చు. దేశంలో ఎక్కడైనా ఈ కార్డుని ఉపయోగించుకోవచ్చు. వికలాంగుల సామాజిక, ఆర్థిక విషయాలు ఈ కార్డు ద్వారా తెలుసుకునే అవకాశం ఉంటుంది. వికలాంగులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి అందే అన్ని పథకాలకు యూడీఐడీ కార్డు కీలకంగా మారనుంది.

స్వగ్రామానికి చేరుకున్న రంగపేటవాసి


మధుకర్‌రెడ్డి

మానకొండూర్, మార్చి 15(ఆంధ్రజ్యోతి): మండలంలోని రంగపేటకు చెందిన మయన్మార్ బాధితుడు కొక్కిరాల మధుకర్‌రెడ్డి శనివారం స్వగ్రామానికి చేరుకున్నాడు. బాధితుడి అనుభవాలు ఆయన మాటల్లోనే.. మధుకర్‌రెడ్డి గత సంవత్సరం డిసెంబరు17న థాయ్‌లాండ్‌కి బతుకుదెరువు కోసం వెళ్లాడు. అక్కడి నుంచి మయన్మార్ దేశంలో ఉద్యోగం కల్పిస్తామని రాజశేఖర్ అనేవ్యక్తి తీసుకెళ్లాడు. రాజశేఖర్.. మధుకర్‌రెడ్డిని చైనాకు చెందిన ఓ కంపెనీకి అమ్మివేయడంతో మోసపోయాడు. ఇండియాకు చెందిన సుమారు వెయ్యి మంది అక్కడే ఉన్నారని కరీంనగర్ ఎంపీ కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్ చొరవతో నాతో పాటు 540మంది ఇండియాకు రాగా మరో 460మంది అక్కడే చిక్కిపోయారని తెలిపారు.

ప్రభుత్వ పాఠశాలలో దొంగతనం

● 23 ట్యాబ్‌ల అపహరణ ● సంఘటనా స్థలాన్ని సందర్శించిన రూరల్ ఏసీపీ


పగులకొట్టిన వెటిలేటర్‌ను పరిశీలిస్తున్న ఏసీపీ శుభం ప్రకాశ్

మానకొండూర్, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో గుర్తు తెలియని వ్యక్తులు 23ట్యాబ్‌లను ఎత్తుకెళ్లిపోయారు. పీఎం శ్రీ(ప్రధానమంత్రి స్కూల్ ఫర్ రైజింగ్ ఇండియా) పథకం కింద పాఠశాలకు ఇటీవల ఒకటి రూ.15వేల చొప్పున రూ.3.80లక్షలతో 25ట్యాబ్‌లను కేంద్రప్రభుత్వం మంజూరు చేసింది. శుక్రవారం హోలీ పండుగ కావడంతో పాఠశాలకు సెలవు ఉంది. దొంగలు మొదటగా పాఠశాల ప్రధానోపాధ్యాయుడి గది వెనకాల ఉన్న వెంటిలేటర్‌ను పగులకొట్టి గదిలోకి దూరారు. ఆ గదిలోని ఓ బీరువాలో ఉన్న తాళాలు తీసుకొని దాని ప్రక్కన ఉన్న మరోగది వెనకాలకు వెళ్లి దాని వెంటిలేటర్‌ను పగులకొట్టి ఆ గదిలోకి దూరారు. మొదటి రూంలో నుంచి తెచ్చుకున్న తాళాల సహాయంతో బీరువాలో ఉన్న 23ట్యాబ్‌లను ఎత్తుకెళ్లారు. మరో రెండు ట్యాబ్‌లు హెచ్‌ఎం బీరువాలో ఉన్నాయి. శుక్రవారం హోలీ పండుగ కావడంతో శనివారం నుంచి ఒంటిపూట బడి ప్రారంభం అయింది. ఉదయం 7.30గంటలకు సిబ్బంది పాఠశాలకు రావడంతో దొంగతనం జరిగినట్లు గుర్తించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాస్ పోలీసులకు సమాచారం ఇవ్వడంతో సీఐ లక్ష్మీనారాయణ సంఘటనా స్థలానికి చేరుకొని దొంగతనం జరిగిన తీరును పరిశీలించారు. కరీంనగర్ రూరల్ ఏసీపీ శుభం ప్రకాశ్‌తోపాటు క్లూస్ టీం సీఐ స్వర్ణజ్యోతి సమాచారమివ్వగా వారువచ్చి చోరీ జరిగిన తీరును పరిశీలించారు. రెండు గదులలోని బీరువాలు, తాళం చెవిలు, రెండు గదుల వెనకాల పగులకొట్టిన వెంటిలేటర్‌లను పరిశీలించారు. బీరువాలతోపాటు తాళం చెవిలు, గోడల వద్ద ఫింగర్ ప్రింట్‌లను సేకరించారు. అనంతరం పాఠశాల సిబ్బందితోపాటు ఉపాధ్యాయుల ఫింగర్ ప్రింట్‌లను సేకరించారు. పాఠశాలకు చెందిన విద్యార్థుల హస్తంతోనే దొంగతనం జరిగి ఉండవచ్చనే అనుమానాలు బలంగా ఉన్నాయి. రెండు, మూడు రోజుల్లో దొంగలు బయటపడే అవకాశాలు ఉన్నాయి. కాగా పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాస్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

రైలు పట్టాల పక్కన యువజంట మృతదేహాలు

● ప్రేమ జంటగా అనుమానం ● ఘటనపై అనుమానాలు


రైల్వే ట్రాక్‌పై మృతదేహాలు

జమ్మికుంట,మార్చి 15 (ఆంధ్రజ్యోతి): జమ్మికుంట మండలం బిజిగిరి షరీఫ్-పాపయ్యపల్లి గ్రామాల రైల్వేట్రాక్ మధ్య ఓ యువజంట అనుమానాస్పద స్థితిలో మృతి చెంది ఉన్నది. వారు ప్రేమ జంట అయి ఉండవచ్చని, గుర్తు తెలియని రైలు కిందపడి ఆత్మహత్య చేసుకుని ఉండవచ్చని అనుమానిస్తున్నారు. మృతి చెందిన యువకుడు ఇల్లందకుంట మండలం రాచపల్లి గ్రామానికి చెందిన మెనుగు రాహుల్ (18)గా గుర్తించారు. ఇతను హైదరాబాద్‌లోని ఓ బేకరీలో పనిచేస్తున్నాడు. మూడు రోజుల క్రితం స్వగ్రామం రాచపల్లికి వచ్చాడు. శనివారం సాయంత్రం 4 గంటలకు ఇంట్లో నుంచి బయటికి వెళ్లాడు. ఫోన్ డిస్‌ప్లే ధ్వంసం కావడంతో యువతి వివరాలు తెలియరాలేదు. ప్రమాదంలో ఇద్దరి తలలకు మాత్రమే దెబ్బలు తగిలి ఉన్నాయి. ఒంటిపై ఎక్కడా గాయాలు లేవు. యువకుడి ముఖం కంకర రాళ్లలోకి చొచ్చుకుపోయి ఉంది. యువతి తలకు తీవ్రంగా గాయమైంది. ఒక సెల్‌ఫోన్ పక్కన పడి ఉండగా, మరొక సెల్ పూర్తిగా ధ్వంసం అయింది. మృతదేహాలు ఒక దగ్గర పడి ఉన్నాయి. రైలు కింద పడితే కొంత దూరం అయినా లాక్కు వెళ్లే అవకాశాలు ఉంటాయి. యువతి మెడకు చున్నీ చుట్టి ఉంది. దీంతో మృతిపై అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. యువజంట రాత్రి వేళలో అటు వైపు ఎలా వచ్చారనేది తెలియాల్సి ఉంది. అటువైపు రావాలంటే పాపయ్యపల్లి గ్రామ రైల్వే క్యాబిన్ నుంచి రావాల్సి ఉంటుంది. ఏదైనా వాహనం మీద వచ్చినా అక్కడే పెట్టి నడుచుకుంటూ వచ్చి ఉండాలి. హత్యా.. ఆత్మహత్యా అనే పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది. రైల్వేపోలీస్‌లు కేసు నమోదు చేశారు.

ముచ్చటగా.. మూడోపెళ్లి..

● పెట్రోల్‌పోసి నిప్పటించిన మొదటి భార్య, కుమారులు
● చికిత్సపొందుతూ వ్యక్తి మృతి


కమలాకర్ (ఫైల్)

జగిత్యాలరూరల్, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల రూరల్ మండలంలోని పొలాసగ్రామంలో పడాల కమలాకర్(60) అనేవ్యక్తి మూడో పెళ్లి చేసుకోగా మొదటి భార్య, కుమారులు పెట్రోల్‌పోసి శనివారం నిప్పంటించారు. తీవ్రంగా గాయపడిన కమలాకర్‌ను ఆస్పత్రికి తరలించగా శనివారంరాత్రి చికిత్సపొందుతూ మృతిచెందాడు. జగిత్యాల రూరల్ ఎస్సై సదాకర్ తెలిపిన వివరాల ప్రకారం.. పడాల కమలాకర్ పొలాస గ్రామంలో వ్యవసాయం చేసుకుంటూ జీవిస్తున్నాడు. గతంలోనే కమలాకర్ రెండు పెళ్లిళ్లు చేసుకోగా ముగ్గురు కుమారులు, ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. సంవత్సరంక్రితం కమలాకర్ మూడోపెళ్లి చేసుకొని గ్రామంలో మూడోభార్యతో కలిసి నివాసం ఉంటున్నాడు. ఈ క్రమంలో మొదటి భార్య, కుమారులను తరుచూ మద్యం తాగివచ్చి వేధించేవాడు. దీంతో కమలాకర్‌పై కోపం పెంచుకున్న మొదటి భార్య పడాల జమునతోపాటుకుమారులు పడాల చిరంజీవి, పడాల రంజిత్, కూతురు శిరీష, అల్లుడుశోభన్‌బాబు శనివారం ఉదయం కమలాకర్ నివాసం ఉంటున్న ఇంటికివెళ్లి గొడవ పడ్డారు. ఈక్రమంలో కమలాకర్‌పై కత్తులతో దాడిచేసి ఒంటిపై పెట్రోల్ పోసి నిప్పటించారు. దీంతో తీవ్రంగా గాయపడిన కమలాకర్‌ను స్థానికులు జగిత్యాల ఏరియా ఆస్పత్రికి తరలించారు. శరీరభాగాలు పూర్తిగా కాలిపోవడంతో చికిత్స పొందుతూ మృతిచెందాడు. మృతుడు కమలాకర్ సోదరుడు పడాల రవి ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సదాకర్ తెలిపారు.

నలుగురు గంజాయి విక్రేతల అరెస్టు

మెట్‌పల్లిటౌన్, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): బీహార్ రాష్ట్రం నుంచి గంజాయి తీసుకొచ్చి మెట్‌పల్లి సర్కిల్ పరిధిలోని పలు ప్రాంతాల్లో విక్రయిస్తున్న నలుగురు సభ్యులు గల ముఠాను అరెస్టు చేసి, వీరి వద్ద 450 గ్రాముల గంజాయి స్వాధీనం చేసుకున్నామని మెట్‌పల్లి సీఐ నిరంజన్‌రెడ్డి తెలిపారు. శనివారం పట్టణంలోని పోలీసు సర్కిల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలను వెల్లడించారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

ఎలిగేడు, మార్చి 15(ఆంధ్రజ్యోతి): జూలపల్లి పోలీస్‌స్టేషన్‌పరిధిలోని ఎలిగేడులో పేకాట ఆడుతున్నారని పక్కా సమాచారం మేరకు పోలీసులు దాడులు చేశారు. పేకాట ఆడుతున్న ముగ్గురిని పట్టుకొని వారి రూ.6600నగదు, 3సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకొన్నట్లు ఎస్సై సనత్‌కుమార్ తెలిపారు. హెచ్‌సి శాంతయ్య, కానిస్టేబుల్‌లు మనోహర్, పవన్ పాల్గొన్నారు.

విధులకు ఆటంకం కలిగించిన యువకుడి అరెస్ట్

ఎల్లారెడ్డిపేట, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): పోలీసు విధులకు ఆటంకం కలిగించిన సంఘటనలో ఎల్లారెడ్డిపేట మండలం రాచర్లబొప్పాపూర్ గ్రామానికిచెందిన యువకుడు గడ్డి నవీన్‌ను అరెస్ట్‌చేసి రిమాండ్‌కు తరలించామని ఎస్ఐ రమాకాంత్ శనివారం తెలిపారు. ఈ నెల14న రాత్రి రాచర్లగొల్లపల్లి బస్టాండు ప్రాంతంలో పండ్ల దుకాణ యజమాని హమీద్‌తో యువకుడు నవీన్ గొడవకు దిగాడని పేర్కొన్నారు. సమాచారం అందుకున్న హెడ్‌కానిస్టేబుల్‌శ్రీనివాస్‌రావు అక్కడకు చేరుకుని శాంతింపజేయడానికి ప్రయత్నిస్తే నవీన్ ఎదురుతిరగడంతోపాటు చేతులతో నెట్టివేశాడని వివరించారు. బ్లూకోల్ట్స్ విధులు నిర్వహిస్తున్న ఆసిఫొద్దిన్, నర్సింలుకు విషయం చెప్పడంతో చేరుకున్నారన్నారు. యువకుడు నవీన్‌ను శాంతింపజేసిన పట్టించుకోకుండా విధులకు ఆటంకం కలిగించడంతోపాటు తమను నెట్టివేశాడని హెడ్‌కానిస్టేబుల్ శ్రీనివాస్‌రావు ఫిర్యాదుతో కేసునమోదు చేశామని చెప్పారు. అరెస్ట్‌చేసి కోర్టులో హాజరుపర్చగా న్యాయమూర్తి 14రోజుల పాటు జైలుశిక్ష విధించినట్లు ఎస్ఐ రమాకాంత్ తెలిపారు.

ఆగి ఉన్న లారీని ఢీకొన్న ఆటో

● పలువురు పదో తరగతి విద్యార్థులకు గాయాలు


చిన్నకలువల వద్ద లారీని ఢీ కొన్న విద్యార్థుల ఆటో

సుల్తానాబాద్, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): సుల్తానాబాద్ నుంచి పెద్దపల్లి వెళుతున్న ఆటో రోడ్డుపై నిలిపి ఉన్న ఓ లారీని ఢీకొంది. ఈ ప్రమాదంలో ఆటోలో ప్రయాణిస్తున్న సుల్తానాబాద్‌కు చెందిన ఓ ప్రైవేట్ స్కూల్‌కు చెందిన పదో తరగతి విద్యార్థులు తీవ్రంగా గాయపడ్డారు. ఎస్ఐ శ్రావణ్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం సుల్తానాబాద్ పట్టణంలోని అల్ఫోర్స్ స్కూల్‌కు చెందిన పదోతరగతి విదార్థులు స్కూల్ ముగిసిన తర్వాత ఆటోలో పెద్దపల్లిలోని ఇండ్లకు వెలుతున్నారు. చిన్నకలువల వద్ద ఆటో అదుపు తప్పి రాజీవ్ రహదారి పక్కన ఆగి ఉన్న లారీని ఢీకొంది. ఈ సంఘటనలో పసునూటి సాయిచరణ్, అప్పాల అభిరామ్, రేవెల్ల ఆదిత్య, వినుకొండ విశాల్, గుండేటి వర్షిత్ అనే విద్యార్థులు తీవ్రంగా గాయపడ్డారు. ఆటోలో మొత్తం ఎనిమిది మంది విద్యార్థులు ప్రయాణిస్తున్నారు. వీరంతా పెద్దపల్లికి చెందినవారే. సంఘటనా సమాచారం అందుకున్న పెద్దపల్లి ట్రాఫిక్ సీఐ అనిల్‌కుమార్, సుల్తానాబాద్ ఎస్ఐ శ్రావణ్‌కుమార్ సంఘటనా స్థలానికి చేరుకుని గాయపడ్డవారిని పెద్దపల్లి ఆసపత్రికి తరలించారు. ప్రమాద వివరాలను నమోదు చేసుకున్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్రగాయాలు

వేములవాడ టౌన్, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్రగాయాలైన సంఘటన వేములవాడ మున్సిపల్‌పరిధిలోని శాత్రాజుపల్లి గ్రామ శివారులో శనివారం రాత్రి చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. శాత్రాజుపల్లి గ్రామానికి చెందిన రేగుల హన్మంతు బైక్‌పై వేములవాడకు వెళుతున్నాడు. అదేక్రమంలో చెరుకుబండి ఎదురుగా వచ్చింది. ఈ రెండు ఎదురెదురగా ఢీకొట్టుకున్నాయి. ఈ సంఘటనలో హన్మంతుకు తీవ్రగాయాలు కాగా ఏరియా ఆసుపత్రికి తరలించినట్లు తెలిపారు.

చీరల ఉత్పత్తిలో వేగం పెంచాలి: టెస్కో జీఎం


మాట్లాడుతున్న టెస్కో జీఎం అశోక్‌రావు

సిరిసిల్ల రూరల్, మార్చి 15 (అంధ్రజ్యోతి): స్వశక్తిసంఘాల మహిళలకు పంపిణీ చేసేందుకు రాష్ట్రప్రభుత్వం ఇచ్చే చీరలఆర్డర్‌లను తీసుకుని ఉత్పత్తిలో వేగం పెంచడంతోపాటు సకాలంలో తయారుచేసి అందించాలని టెస్కో జనరల్ మేనేజర్ అశోక్‌రావు కోరారు. సిరిసిల్లలో శనివారం చీరల తయారీపై యాజమానులు, ఆసాములతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు అసాముల, యాజమానులకు చీరలతయారీ ఆర్డర్‌కాపీలను అందించారు. ఈకార్యక్రమానికి హాజరైన జీఎంఅశోక్‌రావు మాట్లాడుతూ ప్రభుత్వం తయారు చేయిస్తున్న చీరలను నాణ్యతతో ఉండేలాచూసి సకాలంలో అందించాలన్నారు. వేములవాడలో ఏర్పాటుచేసిన యారన్ డిపో నుంచి చీరలకు సంబంధించిన యారన్‌నుతీసుకోవాలని సూచించారు. ఇక్కడి వస్త్ర పరిశ్రమల్లో నెలకొన్న సమస్యలను యాజమానులు, ఆసాములు జీఎంకు విన్నవించగా, సమస్యలను చేనేత జౌళిశాఖ కమిషనర్ దృష్టికితీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషిచేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో చేనేత జౌళిశాఖ సీజీఎం ఎన్‌వీ వెంకటరమణ, సిరిసిల్లఏడీరాఘవరావు పాల్గొన్నారు.

వేములవాడ రాజన్న ఆలయ ఉద్యోగి సస్పెన్షన్

వేములవాడ కల్చరల్, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): రాజరాజేశ్వర స్వామి ఆలయంలో గతంలో పీఆర్వోగా విధులు నిర్వర్తించిన చంద్రశేఖర్‌ను దేవదాయశాఖ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీచేసినట్లు ఆలయ ఈవో వినోద్‌రెడ్డి శనివారం తెలిపారు. రాజన్న ఆలయంలో 2016-17 సంవత్సరానికిగాను వివిధ టీవీ, దినపత్రికలకు ప్రకటనలు ఇవ్వడంలో భాగంగా రూ.28లక్షలలో కొంతమేర బిల్లులు లేకపోవడంతో అవినీతి జరిగినట్లు విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు ప్రభుత్వానికి నివేదిక అందించారని, దాని ఆధారంగా సదరు ఉద్యోగిని సస్పెండ్‌చేస్తూ ఉత్తర్వులు వచ్చినట్లు తెలిపారు. ప్రస్తుతం కొండగట్టులో విధులు నిర్వర్తిస్తుండటంతో అక్కడి ఈవోకు ఉత్వర్వులను పంపించినట్లు ఆలయ ఈవో పేర్కొన్నారు.

ఆలయ ప్రతిష్టను పెంచేలా విధులు నిర్వర్తించాలి: ఈవో

వేములవాడ కల్చరల్, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): వేములవాడ శ్రీరాజరాజేశ్వర స్వామివారి ఆలయానికి వచ్చే భక్తులతో కాంట్రాక్టర్‌లు, ఉద్యోగులు సత్ప్రవర్తనగా వ్యవహరించాలని, భక్తులతో మర్యాదపూర్వకంగా ఉంటూ ఆలయ ప్రతిష్టతను పెంచేలా విధులు నిర్వర్తించాలని ఈవో వినోద్‌రెడ్డి అన్నారు. రాజన్న ఆలయంలోని పలు విభాగాలను శనివారం తనిఖీ చేశారు. రాజన్న ఆలయముందు భాగంలో కొబ్బరికాయలు, బెల్లం దుకాణాన్ని పరిశీలించారు. బెల్లం దుకాణాల్లోని రికార్డులను పరిశీలించి బెల్లం నాణ్యతను, తూకాన్ని పరిశీలించారు. రాజన్న భక్తులను మోసం చేస్తే ఊరుకునేది లేదని అన్నారు. కొబ్బరికాయలు కొట్టేవద్ద అపరిశుభ్రంగా కనిపించడంతో వాటిని వెంటనే తొలగించాలని, ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉండేలా చూడాలని ఆదేశించారు. ఏఈవోలు శ్రావణ్‌కుమార్, బ్రహ్మన్నగారి శ్రీనివాస్, సీనియరల్‌అసిస్టెంట్ కూరగాయల శ్రీనివాస్, ఎఫ్‌సీఎఫ్‌అధికారి కరణ్‌సింగ్ తదితరులు ఉన్నారు.

ఘనంగా ఉగ్ర నారసింహుడి డోలోత్సవం


ఉగ్ర నారసింహుని డోలోత్సవం

ధర్మపురి, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి క్షేత్రంలోని బ్రహ్మ పుష్కరిణి (కోనేరు)లో ఉగ్రనారసింహస్వామి తెప్పోత్సవం, డోలోత్సవం శనివారం ఘనంగా నిర్వహించారు. ఆస్థాన వేదపండితులు బొజ్జ రమేష్ శర్మ తదితర వేదబ్రాహ్మణుల మంత్రోచ్చరణల మధ్య స్వామివారల ఉత్సవమూర్తులను సేవలపై ఉంచి బ్రహ్మ పుష్కరిణికి తీసుకువచ్చారు. అనంతరం హంసవాహన రూపంలోని పడవపై స్వామివారలను కూర్చో బెట్టి, బ్రహ్మపుష్కరిణిలో ఐదుసార్లు ప్రదక్షిణలు చేయించారు. భక్తులు నరసింహ నామస్మరణలు చేస్తూ మెట్లపైన ప్రదక్షిణలు చేయగా కొందరుమహిళలు త్రిశూలం చేతబట్టుకుని పూనకాలతో స్వామివారలను కొలుస్తుండగా అర్చకులు తెప్పోత్సవం జరిపారు. అనంతరం స్వామివారల సేవలను బ్రహ్మపుష్కరిణిమధ్య గల మండపంలోని ఊయలపై ఆసీనులను చేశారు. సనాతన సాంప్రదాయరీతిలో అర్చకులు స్వామివారల డోలోత్సవం నిర్వహించారు. భక్తులు వెళ్లి స్వామివారలపై బుకాగులాలు చల్లి కట్నకానుకలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. నిజామాబాద్ జిల్లాకు చెందిన భక్తులు డోలోత్సవం తిలకించిన అనంతరం నెత్తిమీద ముల్లెమూట పెట్టుకుని తిరుగు ప్రయాణం పట్టారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా ధర్మపురి సీఐ రాంనర్సింహరెడ్డి ఆధ్వర్యంలో ఎస్ఐ ఉదయ్‌కుమార్, శ్రీధర్, ఉమాసాగర్, సతీష్, దత్తాత్రి, కుమారస్వామి, పోలీస్ సిబ్బంది బందోబస్తు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ జక్కు రవీందర్, ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డి, ధర్మకర్తల మండలి సభ్యులు పాల్గొన్నారు.


ఉగ్ర నారసింహుని తెప్పోత్సవం

హలీం.. సలాం..

- సర్వజనులకు ఎంతో ప్రియం..
- రంజాన్ మాసం.. నోరూరించే రుచులు
- అరబ్ దేశాల నుంచి తెలంగాణకు..
- జిల్లా ప్రధాన కూడళ్లలో ప్రత్యేక స్టాళ్లు
- అదివారం ప్రత్యేకం


చికెన్ మంచూరియా
డబుల్‌కా మీఠా
హలీమ్
హలీమ్ తయారు చేస్తున్న మాస్టర్

(ఆంధ్రజ్యోతి, సిరిసిల్ల)
రంజాన్ మాసం వచ్చిందంటే ఎక్కడ చూసినా హలీమ్ ఘుమఘుమలు నోరూరిస్తాయి. ముస్లింలే కాదు సర్వజనులకు హలీమ్ ఎంతో ప్రియమైనదిగా భావిస్తారు. వీటితో పాటు రంజాన్ సందర్భంగా తయారుచేసే వంటకాల కోసం రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రధాన కూడళ్లలో కేంద్రాలను నిర్వహిస్తున్నారు. పవిత్ర రంజాన్ మాసం ప్రారంభం నుంచే హలీమ్ రుచులతో పాటు చికెన్ మంచూరియా, చికెన్ కర్రీ, తందూరి చికెన్, డబుల్‌కా మీఠా, రుమాల్ రోటి వంటి రుచులను నిర్వాహకులు అందిస్తున్నారు. రంజాన్ సందర్భంగా ఆంధ్రజ్యోతి ప్రత్యేక కథనం..

● హైదరాబాద్ నుంచి చిన్న నగరాలకు రంజాన్ రుచులు..

ఒకప్పుడు హైదరాబాద్‌కే పరిమితమైన హలీమ్ ఇప్పుడు చిన్న చిన్న నగరాల్లో సైతం లభిస్తోంది. ఇప్పటికీ రుచికరమైన హలీమ్‌కు మన హైదరాబాదే ప్రసిద్ధిగాంచింది. రుచుల పరంగా కాకుండా కేలరీల పరంగా కూడా హలీమ్ ఎంతో ముఖ్యంగా చెప్పుకుంటారు. రోజా రోజుల్లో అందే రుచుల్లో ముఖ్యంగా ఉండే హలీమ్ అరబ్ దేశాల నుంచి తెలంగాణకు వచ్చి వందేళ్లు పూర్తి చేసుకుంది. మారుతున్న ప్రజల ఆహార అలవాట్లకు అనుగుణంగానే హలీమ్‌ను కూడా రకరకాల వెరైటీలతో హోటల్ యజమానులు తయారు చేస్తున్నారు. 1866-1911 మధ్య కాలంలో నాటి నిజాం నవాబు తమ వంటశాలలో దీనిని ప్రత్యేకంగా తయారుచేయించి అతిథులకు వడ్డించేవారని చరిత్ర చెబుతోంది. హలీమ్ విక్రయ కేంద్రాలు మాత్రం 50 ఏళ్ల క్రితం మాత్రమే మొదలయ్యాయి.

హలీమ్ చరిత్రలోకి వెళితే...

వంద సంవత్సరాల క్రితం నిజాం రాజు తన వ్యక్తిగత సైన్యం కోసం యెమెన్, సౌదీ, అరబ్ దేశాల నుంచి రక్షక భటులను తెప్పించుకునేవారు. వారు ఇక్కడికి వచ్చిన తరువాత రోజూవారి ఆహారం కాకుండా ప్రత్యేకంగా తయారు చేయడానికి వంట మనుషులు కూడా వచ్చారు. వచ్చిన వారు సైనికులు ఎక్కువసేపు ఆహారం లేకుండా ఉండేందుకు గోధుమలు, నెయ్యి, మాంసంతో ఒక పదార్థాన్ని తయారుచేసేవారు. దానిని అప్పుడు హరీస్‌గా పిలిచేవారు. స్వచ్ఛమైన గోధుమలు, నెయ్యి, మాంసాన్ని సమభాగంలో ఉడికించి తినేవారు. కాలానుగుణంగా ఇక్కడే ఉండిపోయిన అరబ్బులు, నిజాం పండుగ వేడుకల్లో కూడా హరీస్‌ను తయారు చేయించి వడ్డించేవారు. నిజాం రాజ వంశీకుల ఇండ్లతో పాటు ప్రస్తుతం దేశవ్యాప్తంగా హరీస్, హలీమ్ వంటకాలు ప్రసిద్ధి చెందాయి.

● వెజిటేరియన్ హలీమ్...

శాఖాహారులకు కూడా వెజిటేరియన్ హలీమ్ అందుబాటులోకి తెచ్చారు. ఫిష్ హలీమ్ తయారు చేసే విధానంలోనే దీనిని తయారు చేస్తారు. గోధుమరవ్వతో పాటు కొద్దిపాటి మసాలాను వినియోగిస్తారు. వండిన తరువాత చివరలో బీన్స్, క్యారెట్, కీరా, పచ్చి బఠానీలు కలిపి ఉడికిస్తారు. ఘాటుగా ఉండకుండా పెరుగుతో పాటు పాలు కలుపుతారు.

● జాఫ్రానీ హలీమ్...

జాఫ్రానీ హలీమ్‌లో గోధుమలు, మాంసం, నెయ్యితో పాటు కుంకుమపువ్వు వాడుతారు. దీంతో ఇది సుగంధం వెదజల్లుతుంది. అవసరమయిన వాళ్లు దీనిని ప్రత్యేకంగా తయారు చేయించుకుంటారు. ఎక్కువగా తింటే వేడి చేసే అవకాశం ఉంది.

● దక్కన్ హలీమ్...

నిజాం కాలంలో అరబ్బులు తయారు చేసే హలీమ్‌ను దక్కన్, దక్కని పేర్లతో పిలిచేవారు. ఇందులో గోధుమలతో పాటు మాంసం మోతాదు రెండు నుంచి మూడింతలు వేస్తారు. గరం మసాలాతో పాటు లవంగం, ఇలాచీ, పప్పుదినుసులు కలిపి దీనిని తయారు చేస్తారు.

● ఇరానీ హలీమ్...

పాతకాలం వారు ఇప్పటికీ ఇరానీ హలీమ్ తయారుచేస్తున్నారు. ఇరానీ హలీమ్ ఘాటుగా ఉండదు. డ్రై ఫ్రూట్స్‌తో పాటు గోధుమలు, మినప పప్పు, తక్కువ మోతాదులో మసాలా దినుసులు వినియోగిస్తారు. ఈ హలీమ్ ఎక్కువగా పేస్ట్‌లా కాకుండా చిన్నచిన్న గింజలుగా ఉంటుంది.

● మటన్ హలీమ్...

గోధుమలు, మటన్‌తో పాటు శనగపప్పు, మినప పప్పు, ఎర్రపప్పు కలిపి తయారు చేస్తారు. మసాలా దినుసులు కలిపి ఘాటుగా తయారు చేస్తారు.

● మరెన్నో ఘుమఘుమలు

రంజాన్ పర్వదినాల్లో హలీమ్, హరీస్, రుచులతో పాటు మరెన్నో వంటకాలు ఘుమఘుమలాడుతాయి. దమ్ బిర్యానీతో పాటు డబుల్‌కా మీఠా, కబాబ్, సేమియా, కుర్బానీకా మీఠా, చికెన్ టిక్కాలు, తందూరి చికెన్, రుమాలీ రోటీ, రుచులను అందిస్తారు.

20 ఏళ్లుగా హలీమ్ చేస్తున్నాను...
- ఎస్‌కే తౌఫిక్, మాస్టర్



రంజాన్ మాసంలో అందరికీ ఇష్టమైన హలీమ్, హరీష్‌తో పాటు బుల్‌కా మీఠా, కబాబ్, సేమియా, కుర్బానీకా మీఠా, చికెన్ టిక్కాలు, తందూరి చికెన్ తయారుచేస్తాను. దాదాపు 20 ఏళ్లుగా హలీమ్ తయారు చేస్తున్నాను. అందరూ బాగా ఇష్టపడుతారు.

ప్రతి రంజాన్‌కు స్టాల్ ఏర్పాటు..
- ముజీబ్, నిర్వాహకుడు



ప్రతి రంజాన్ మాసంలో హలీమ్, హరీష్ ఇతర పదార్థాలను అందించడానికి స్టాల్ నిర్వహిస్తున్నాను. అందరు ఎక్కువగా హలీమ్, హరీస్, పిల్లలు తందూరి చికెన్ ఇష్ట పడుతారు.

కాంగ్రెస్, బీఆర్ఎస్ డ్రామాలు

● మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి సస్పెన్షన్‌పై
కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్


మాట్లాడుతున్న కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్

భగత్‌నగర్, మార్చి 15(ఆంధ్రజ్యోతి): అసెంబ్లీనుంచి మాజీమంత్రి జగదీశ్‌రెడ్డి సస్పెన్షన్‌తో కాంగ్రెస్, బీఆర్ఎస్‌డ్రామాలు ఆడుతున్నాయని కేంద్రహోంశాఖ సహాయమంత్రి బండి సంజయ్ కుమార్ అన్నారు. శనివారం నగరంలోని టీఎన్‌జీవో హాలులో విలేకరులతో మాట్లాడారు. ప్రజల దృష్టిని మళ్లించడానికి జగదీష్‌రెడ్డిని అసెంబ్లీ నుంచి సస్పెండ్‌చేసి డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నారన్నారు. కాంగ్రెస్,బీఆర్ఎస్ రెండుపార్టీలు ఎమ్మెల్సీఎన్నికల్లో బీజేపీ గెలుపును జీర్ణించుకోలేక పోయాయని, కొత్త ఎత్తుగడలు వేస్తున్నాయని అన్నారు. రాష్ట్రప్రభుత్వం ఆరుగ్యారంటీలను అమలు చేయడంలేదన్నారు. కేంద్రం స్మార్ట్‌సిటీ నిధులు మంజూరు చేస్తే రాష్ట్రవాటా ఇవ్వడం లేదన్నారు. రాజాసింగ్ వ్యాఖ్యలను తాను వినలేదని, బీఆర్ఎస్, కాంగ్రెస్ మధ్యే రహస్యభేటీలు జరుగుతున్నాయని, ఆ రెండుపార్టీలు ఒక్కటేనని అన్నారు. ఆరుగ్యారంటీలపైనా ప్రజాసమస్యలపైనా చర్చించే దమ్ముందా? అని ప్రశ్నించారు. పది లక్షలఎకరాలు పంటలు ఎండిపోతున్నా ప్రభుత్వానికి పట్టింపులేదన్నారు.రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు ఇచ్చినహామీలు ఏమయ్యాయని ప్రశ్నించారు. రుణమాఫీ, రైతుభరోసా, నిరుద్యోగభృతి, ఉద్యోగుల డీఏ, వృద్ధులకు రూ.4 వేల పింఛన్, కల్యాణలక్ష్మి తులం బంగారం, మహిళలకు నెలకు రూ.2500, కాంట్రాక్టర్లు, మాజీ సర్పంచుల పెండింగ్ బిల్లులు వంటి వాటి ఊసేలేదన్నారు. ప్రజలు అన్ని గమనిస్తున్నారని, కేసీఆర్ ప్రభుత్వానికి దించి వేశారని, కాంగ్రెస్‌కు అదే గతిపడుతుందని అన్నారు. తమిళనాడులో డీఎంకేపై ప్రజల్లో వ్యతిరేకత ఉందని, అందుకే డీలిమిటేషన్‌తో దక్షిణాదికి అన్యాయం చేస్తున్నారని, డ్రామాలు మొదలు పెట్టారని అన్నారు. తెలంగాణతోపాటు కర్నాటకలో కాంగ్రెస్ పరిస్థితి మరీ దారుణంగా ఉందన్నారు. కేరళలో పరిస్థితి అలాగే ఉందన్నారు. ఆయా పార్టీలన్నీ కలిసి బీజేపీని దెబ్బతీసేందుకు చూస్తున్నాయన్నారు. హైదరాబాద్‌లో మిస్‌వరల్డ్, తబ్లిగీ జమాతే సంస్థల సమావేశాల పేరుతో కోట్లుఖర్చు చేస్తున్నారన్నారని, ఇవి చేస్తే హైదరాబాద్ బ్రాండ్‌పెరుగుతుందా? అని ప్రశ్నించారు. తెలంగాణలో హైదరాబాద్‌తో సహా డ్రగ్స్‌తో పిల్లలు అల్లాడుతున్నారన్నారు. డ్రగ్స్ దందాచేసే వారిపై కఠినచర్యలు తీసుకోవాలని, పోలీసులకు పూర్తి స్వేచ్ఛ ఇచ్చి వాటిపై ఉక్కుపాదం మోపాలని అన్నారు. డ్రగ్స్ విక్రయాలు ఆందోళన కలిగిస్తున్నాయన్నారు. డ్రగ్స్ కేసుపై విచారణ లేదని, ఫోన్‌ట్యాపింగ్‌పై కేసీఆర్ పాత్ర ఉందని తెలిసినా ఎందుకు అరెస్టు చేయలేదని అన్నారు. హైదరాబాద్ సెంట్రల్ వర్సిటీ వద్ద ఉన్న వందలాది ఎకరాల ప్రభుత్వ భూములను అమ్ముకోవాలని చూస్తున్నారన్నారు. సమావేశంలో మాజీఎమ్మెల్యే బొడిగె శోభ, బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడికృష్ణారెడ్డి, మాజీమేయర్ సునీల్‌రావు, పార్లమెంట్ కన్వీనర్ బోయినపల్లి ప్రవీణ్‌రావు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా రుక్మిణీశ్రీకృష్ణుల కల్యాణం

కాల్వశ్రీరాంపూర్, మార్చి 15(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలో శనివారం శ్రీకృష్ణ ఆలయంలో రుక్మిణీసమేత శ్రీకృష్ణ కల్యాణాన్ని యాదవ సంఘం ఆధ్వర్యంలో అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఆలయంలో ఆరాధన, అభిషేకం,ఎదుర్కోలుమహోత్సవం, హోమం, సామూహిక కుంకుమపూజలు నిర్వహించారు. స్వామి వారికి అల్లంల దేవేందర్‌స్వప్న, అల్లం కుమార్ కోమల దంపతులు పట్టువస్త్రాలు, తలంబ్రాలు సమర్పించారు. వేదపండితుల మంత్రోచ్చారణల మధ్య రుక్మిణీశ్రీకృష్ణ కల్యాణం నిర్వహించగా తిలకించడానికి అధిక సంఖ్యలో భక్తులు హాజరయ్యారు. వ్యవసాయమార్కెట్ చైర్మన్ రామిడి తిరుపతిరెడ్డి, మాజీఎంపీపీలు గోపగోని సారయ్యగౌడ్, నూనేటిసంపత్, మాజీ జడ్పీటీసీలు తిరుపతిరెడ్డి, రాములు, జూకం టి శిరీష, కాంగ్రెస్‌పార్టీ మండలాధ్యక్షుడు సదయ్య, అర్చకులు అనంత శ్రీరాములశర్మ, నిఖిల్ శర్మ, లిఖిల్‌శర్మ, యాదవసంఘం నాయకులు, భక్తులు పాల్గొన్నారు.


కల్యాణం నిర్వహిస్తున్న వేదపండితులు

ఘనంగా వేంకటేశ్వర స్వామి రథోత్సవం


వేంకటేశ్వర స్వామి రథోత్సవంలో పాల్గొన్న ప్రజలు

ధర్మారం, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): దొంగతుర్తి గ్రామంలోని లక్ష్మిగోదాదేవి సమేత వేంకటేశ్వరస్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. శనివారం స్వామి వారి రథోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించారు. మండలంలోనివివిధ గ్రామాలతోపాటు ఉమ్మడి కరీంనగర్‌జిల్లా నుంచి భక్తులు పెద్దఎత్తున తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. జాతీయ ఎస్సీకమిషన్ సభ్యులు వడ్డేపల్లిరామచంద్రం స్వామితోపాటు నందిమేడారం ప్యాక్స్‌చైర్మన్ ముత్యాల బలరాం రెడ్డి దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఈనెల 10నుంచి మొదలైన బ్రహ్మోత్సవాలు శనివారం రథోత్సవంతో ముగిశాయి.

కొండగట్టు అంజన్న సన్నిధిలో భక్తుల రద్దీ

మల్యాల, మార్చి 15(ఆంధ్రజ్యోతి): కొండగట్టు ఆంజనేయస్వామి సన్నిధానం శనివారం భక్తులతో రద్దీగా మారింది. వేకువజాము నుంచే తరలివచ్చిన భక్తులు స్వామి వారిని దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. ఆలయంలో అభిషేక పూజలు చేశారు. అనంతరం బేతాళుడు, శ్రీరాముని ఆలయంలో పూజలు చేశారు. భక్తులకు ఇబ్బందులు కలుగకుండా ఆలయ అధికారులు పర్యవేక్షించారు.

తలనీలాల ద్వారా
రూ.1.46కోట్ల ఆదాయం..

మల్యాల, మార్చి 15(ఆంధ్రజ్యోతి): గతంలో కొండగట్టు ఆంజనేయస్వామి దేవస్థానం ద్వారా సేకరించిన తలనీలాల ద్వారా దేవస్థానానికి రూ.1.46కోట్ల ఆదాయం సమకూరింది. 2023 ఆగస్టు నుంచి 2024 జూలై వరకు తలనీలాల సేకరణ టెండర్ ఖరారు కాకపోవడంతో దేవస్థానం తరుపున తలనీలాలు సేకరించగా వాటికి గాను అధికారులు ఈ ఏడాది జనవరిలో టెండర్లు నిర్వహించారు. ఇందులో కిలోకి రూ.10,300 చొప్పున హెచ్చు పాటదారు అయిన హైదరాబాద్‌కు చెందిన మదర్ హ్యూమన్ హేర్స్‌కు శనివారం అప్పగించారు. దీంతో దేవస్థానానికి రూ.1,46,48,866 ఆదాయం వచ్చింది. కార్యక్రమంలో ఈవో శ్రీకాంత్‌రావు, పర్యవేక్షకులు చంద్రశేఖర్, సునీల్ తదితరులు పాల్గొన్నారు.


క్యూలో వస్తున్న అంజన్న భక్తులు

నేటి నుంచి శివకల్యాణోత్సవం

● రాజన్న ఆలయంలో ఐదు రోజులపాటు నిర్వహణ

వేములవాడ కల్చరల్, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): వేములవాడ రాజరాజేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం నుంచిశివ కల్యాణ వేడుకలు ప్రారంభం కానున్నాయి. మహాశివరాత్రి పర్వదినం రోజున శ్రీపార్వతి పరమేశ్వరుల కల్యాణం నిర్వహించాల్సి ఉంటుంది. అయితే రాజన్నక్షేత్రంలో మాత్రం 60యేళ్లుగా అనాధిగా వస్తున్న సంప్రదాయంతో శివమహాపురాణం, లింగ పురాణం ఆధారంగా మన్మథుడి దహనంతో ఉత్సవాలు పూర్తైన తరువాత శ్రీపార్వతి పరమేశ్వరుల కల్యాణ వేడుకలు ప్రారంభమవుతాయని అర్చకులు వివరించారు. ఈనెల16నుంచి 20వరకు అంగరంగ వైభవంగా కళ్యాణాన్ని నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

● సోమవారం రాజన్న కల్యాణం..

శివకల్యాణ వేడుకల్లో భాగంగా ఈనెల 17వ తేదిన సోమవారం రోజున ఉదయం 10.40 గంటల నుంచి 12.55 గంటల వరకు రాజన్న ఆలయ ఆవరణలోని గెస్ట్ హౌస్ ముందు ఏర్పాటు చేసిన ప్రత్యేక వేదికపై కల్యాణ వైభవాన్ని నిర్వహిస్తారు. 19వ తేది బుధవారం సాయంత్రం 3.05గంటలకు స్వామివారి రథోత్సవం కన్నుల పండవగా నిర్వహించనున్నారు. 20వ తేది గురువారం రోజున ఉదయం పూర్ణాహుతి అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించి ఏకాంత సేవ పూజాకార్యక్రమాలతో వేడుకలు ముగియనున్నాయి.

● భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు..

రాజన్న ఆలయంలో నిర్వహించే శివ కళ్యాణోత్సవానికి భక్తులు పెద్దసంఖ్యలో తరలిరానున్నారని రాజన్న ఆలయఈవో వినోద్‌రెడ్డి తెలిపారు. భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా చలువ పందిళ్లను ఏర్పాటు చేశామని, భక్తుల సౌకర్యార్థం గ్యాలరీలను ఏర్పాటు చేస్తున్నామని, వేసవికాలం కావడంతో తాగునీరు, మజ్జిగప్యాకెట్లు, మధ్యాహ్నం భోజనసౌకర్యం కల్పిస్తున్నట్లు తెలిపారు.

ఉద్యోగులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలి

● టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు చావ రవి



జగిత్యాలలో మాట్లాడుతున్న టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు రవి

జగిత్యాల అగ్రికల్చర్/సిరిసిల్ల రూరల్, మార్చి 15(ఆంధ్రజ్యోతి): అసెంబ్లీ ఎన్నికల సమయంలో ఉద్యోగులకు కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేసి, ఉద్యోగులపై ప్రభుత్వ విశ్వసనీయతను చాటుకోవాలని టీఎస్‌యూటీఎఫ్ ఉపాధ్యాయ సంఘం రాష్ట్రఅధ్యక్షుడు చావ రవి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సంఘం జిల్లా కమిటీ సమావేశాలు జగిత్యాల, సిరిసిల్లలో జరగగా ఆయన పాల్గొని మాట్లాడారు. పెండింగ్ బిల్లులను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. సెలవు జీతాలు, సప్లిమెంటరీ వేతనాలు, మెడికల్ బిల్లులు, జీపీఎఫ్, పెన్షన్, టీఎస్ జీఎల్ఐ తదితర బిల్లులు విడుదల కాకపోవడంతో ఉద్యోగులు, గత సంవత్సరం మార్చి నుంచి రిటైర్ అయిన ఉద్యోగులకు గ్రాట్యూటీ, కమ్యూటేషన్ మొత్తాలను చెల్లించకపోవడంతో పెన్షనర్లు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. బకాయిలు పడిన నాలుగు వాయిదాల డీఏలను వెంటనే చెల్లించాలని, పీఆర్సీ నివేదికను తెప్పించి ఉద్యోగ సంఘాలతో చర్చించి తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకట్ మాట్లాడుతూ 317జీవో బాధితులకు న్యాయం చేయాలని, సీపీఎస్ రద్దు చేయాలని, 2003 డీఎస్సీ ఉపాధ్యాయులకు పాత పెన్షన్ అమలు చేయాలని రాష్ట్రంలో అన్ని జిల్లాలకు డీఈవోలను, మండలాలను ఎంఈవోల పోస్టులు మంజూరు చేయాలన్నారు. నెలాఖరులోపు సమస్యలు పరిష్కరించకుంటే ఏప్రిల్‌లో తెలంగాణఉద్యోగుల జేఏసీ ఆధ్వర్యంలో దశలవారీగా ఉద్యమాలకు కార్యాచరణ నిర్వహిస్తామని హెచ్చరించారు. అంతకుముందు టీఎస్‌యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి అంబటి భూమేశ్వర్‌పై మీడియాలో వచ్చిన అసత్య వార్తను జిల్లా కమిటీ పక్షాన తీవ్రంగా ఖండిస్తున్నామని, తప్పుడు ఆరోపణలతో వేధింపులకు గురిచేసిన వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సమావేశంలో రాష్ట్రప్రధాన కార్యదర్శి వెంకట్, కార్యదర్శి గోల్కొండ శ్రీధర్, జిల్లా అధ్యక్షుడు శ్యామ్, ప్రధాన కార్యదర్శి భూమేశ్వర్, శ్రీనివాస్, సుశీల, ఆగమయ్య, ప్రసాద్, శ్రీధర్, శ్రీనివాస్‌గౌడ్, స్వర్ణలత, గోపి, జయంత్, సిరిసిల్లలో జరిగిన కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి జంగిటి రాజు, సీనియర్‌నాయకులు పాకాల శంకర్‌గౌడ్, ఉపాధ్యక్షుడు మహేందర్‌రావు, కోశాధికారి అంబటి రమేష్, జిల్లా కార్యదర్శి పోలాస మల్లేశం, మధుసూదన్ తదితరులు పాల్గొన్నారు

తెలంగాణ సంస్కృతి ఉట్టిపడేలా ప్రదర్శనలు..

● రాజన్న ఆలయ ఈవో వినోద్‌రెడ్డి

వేములవాడ కల్చరల్, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలు ఉట్టిపేడేలా ప్రదర్శనలు ఉండాలని రాజన్న ఆలయ ఈవో వినోద్‌రెడ్డి అన్నారు. వేములవాడ శ్రీరాజరాజేశ్వర స్వామివారి ఆలయంలో ఐదు రోజుల పాటు నిర్వహించే శివకల్యాణోత్సవాలను పురస్కరించుకుని శనివారం నృత్యప్రదర్శన కార్యక్రమాన్ని జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఈవో మాట్లాడుతూ తెలంగాణ సంస్కృతిని ప్రతిబింబించేలా కళాకారులు తమ ప్రదర్శనలు చేయాలని సూచించారు.

భక్తులను అలరించిన మాయాబజార్ ప్రదర్శన..

వేములవాడ రాజన్న ఆలయంలోని ఓపెన్ స్లాబ్‌లో ఏర్పాటు చేసిన ప్రత్యేక వేదికపైన ఏర్పాటు చేసిన మాయాబజాం నృత్యప్రదర్శన భక్తులను అలరించింది. హైదరాబాద్‌కు చెందిన వినాయక నాట్యమండలి సురభి శ్రీదినకరు ఆధ్వర్యంలో నిర్వహించారు.


కళాకారుల మాయాబజార్ ప్రదర్శన

కరాటేలో రాణిస్తున్న దుమాల విద్యార్థినులు

- రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీల్లో పతకాలు..



సాధన చేస్తున్న విద్యార్థినులు



సాధించిన పతకాలతో విద్యార్థినులు, ఉపాధ్యాయులు

ఎల్లారెడ్డిపేట, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): వారంతా గ్రామీణ ప్రాంత విద్యార్థినులు.. తల్లిదండ్రులు కూలీ పనులు చేస్తేనే బతుకు సాగే కుటుంబాలు.. ప్రభుత్వ బడిలో విద్యనభ్యసిస్తున్న బాలికలు.. కార్పోరేటు స్థాయి సౌకర్యాలు లేకపోయినా.. అందుబాటులో ఉన్న వసతులతో ముందుకు సాగుతున్నారు. వసతులు లేకపోతేనేం.. ఆత్మవిశ్వాసంతో మెళకువలు నేర్చుకుని తామేంటో నిరూపిస్తున్నారు. అటు చదువుతో పాటు కరాటే పోటీల్లో సత్తా చాటుతున్నారు. బరిలో దిగి పంచ్ విసిరితే ప్రత్యర్థి మట్టి కరవల్సిందే మరీ. విద్యార్థినులు కరాటేలో చిరుతలుగా మారుతున్నారు. రాష్ట్ర, జాతీయ స్థాయిలో రాణిస్తూ పతకాల పంట పండిస్తున్నారు. ప్రభుత్వ పాఠశాలలో చదివితేనేం జాతీయ స్థాయిలో పంచ్ విసురుతున్నారు ఎల్లారెడ్డిపేట మండలం దుమాల గ్రామంలోని జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల విద్యార్థినులు. 12 ఏళ్ల వయసులోనే కరాటేలో ఆరితేరుతున్నారు. తమకు మరిన్నీ వసతులు కల్పిస్తే అంతర్జాతీయ స్థాయిలో రాణిస్తామని పేర్కొంటున్నారు ఈ విద్యార్థినులు.

ఆత్మవిశ్వాసంతో ముందుకు..

మండలంలోని దుమాల జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో ఆరో తరగతి నుంచి 9వ తరగతి విద్యార్థినులకు ఆత్మరక్షణ కోసం కరాటేలో మెలకువలను నేర్పించాలనే లక్ష్యంతో ప్రభుత్వం మూడు నెలల శిక్షణ తరగతులను చేపట్టింది. కరాటే మాస్టర్ రామకృష్ణ మూడు నెలల పాటు సాయంత్రం వేళ విద్యార్థినులకు కరాటేలో శిక్షణ ఇచ్చారు. విద్యార్థినులను క్రీడా మైదానంలో అసౌకర్యాలు వేధించిన వారు వెరవలేరు. ఇతరుల నుంచి తమను తాము కాపాడుకునేందుకు కరాటే అవసరమనే మాటలు వారి మెదళ్లలో మెదలాయి. ఎలాంటి వసతులు లేకపోయినా.. కరాటే మాస్టర్ రామకృష్ణ శిక్షణలో ఆరితేరారు. మూడు నెలల్లోనే మెలకువలను నేర్చుకున్నారు. ఎక్కడికి వెళ్లినా పంచ్‌లతో అదరగొడుతున్నారు. బంగారు, కాంస్య పతకాలను సాధించి ఔరా అనిపించుకుంటున్నారు.

విద్యార్థినుల విజయాలు..

సిరిసిల్ల పట్టణంలోని ఇటీవల నిర్వహించిన కరాటే, కుంగ్‌ఫూ రాష్ట్ర స్థాయి పోటీల్లో అండర్-12 విభాగంలో విద్యార్థినులు సల్మాల అర్చిత, నిమ్మల లోహితలు పాల్గొని తమ సత్తా చాటారు. రాష్ట్ర స్థాయి పోటీల్లో అత్యంత ప్రతిభ కనబర్చి బంగారు పతకాలను సాధించారు. అలాగే పెద్దపల్లిలోని ఇంటర్నేషనల్ షావోలింగ్ కుంగ్‌ఫూ బ్రూస్ మార్షల్ ఆర్ట్ అకాడమీ ఆధ్వర్యంలో ఈనెల 9న నిర్వహించిన జాతీయ స్థాయి కరాటే పోటీల్లో విద్యార్థినులు నిమ్మల సాన్వి, నిమ్మల లోహిత, నిమ్మల రిత్విక, నిమ్మల ధనుజ్ఞ, సల్మాల అర్చితలు పాల్గొన్నారు. సాన్వి, లోహితలు పంచ్‌లతో అదరగొట్టి బంగారు, రిత్విక, ధనుజ్ఞ, అర్చితలు కాంస్య పతకాలు సాధించారు.

రెండు పోటీల్లో ప్రతిభ చూపాను..

- నిమ్మల ధనుజ్ఞ



నేను 7వ తరగతి చదువుతున్నారు. పాఠశాలలో రోజు సాయంత్రం కరాటేలో శిక్షణ తీసుకున్నా. మూడు నెలలపాటు మెళకువలు నేర్చుకున్నా. రెండు పోటీల్లో పాల్గొని ప్రతిభ చూపా. పెద్దయ్యాక ఎస్ఐ కావాలన్నది నా కోరిక.

వసతులు కల్పించాలి..

- సల్మాల అర్చిత



నేను ప్రభుత్వ పాఠశాలలో 6వ తరగతి చదువుతున్నా. ఎలాంటి వసతులు లేకపోయినా ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగుతున్నా. వసతులు కల్పిస్తే అంతర్జాతీయ స్థాయిలో రాణించి ఊరు, అమ్మనాన్నల పేరు నిలబెడుతా.

ప్రభుత్వం నిధులు కేటాయించాలి

- రామకృష్ణ, కరాటే మాస్టర్



ప్రభుత్వ పాఠశాల్లో చదివే విద్యార్థినులు అన్నింటా రాణిస్తున్నారు. ప్రభుత్వం క్రీడలకు నిధులు కేటాయించాలి. కరాటేలో 3 నెలలపాటు శిక్షణ పొందిన విద్యార్థినులు రాష్ట్ర, జాతీయ స్థాయిలో రాణించి పతకాలను సాధించారు.

పరీక్ష సామగ్రి పంపిణీ

ఇల్లంతకుంట, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని జిల్లాపరిషత్ పాఠశాల ఆవరణలో విద్యార్థులకు యువజన నాయకుడు మామిడి హరీష్ పరీక్షల సామగ్రిని పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయిణి ప్రేమలత, యువజన నాయకులు నాగసముద్రాల సంతోష్, దుర్శట్ల ప్రశాంత్, ఓరుగంటి శేఖర్, అరవిందల పాటు ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

● చందుర్తి: మండలంలోని నర్సింగాపూర్ గ్రామంలో పదో తరగతి విద్యార్థిని, విద్యార్థులకు పెరుక రంజిత్ అనే యువకుడు శనివారం ఉచిత పాడ్స్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో నర్సింగాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు జితేందర్, పెరుక గంగరాజు, చింతకుంట గంగాధర్, శ్రీనివాస్, ఒరగంటి పర్శరాములు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, పాల్గొన్నారు.

● కోనరావుపేట (ఆంధ్రజ్యోతి) : కోనరావుపేట మండలం నిమ్మపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలోని పదో తరగతి విద్యార్థులకు గిరిజన ఐక్యవేదిక నాయకుడు బానోతు నరేష్ నాయక్ ప్యాడ్స్, పెన్నులు అందజేసి మాట్లాడారు. ఈకార్యక్రమంలో ఇస్లావత్ రాజు, శ్రీనివాస్, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి విరాళాలు

చందుర్తి, మార్చి (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో మల్లికార్జునస్వామి ఆలయ నిర్మాణానికి వివిధ కుల సంఘాల నాయకులు శనివారం విరాళాలు అందజేశారు. గ్రామంలోని పురగిరి క్షత్రియ పెరుక సంఘం వారు రూ.50 వేల 16, మున్నూరుకాపు సంఘం ఆధ్వర్యంలో రూ.15వేలు అందజేశారు.

అరుదైన శస్త్రచికిత్స

ఎల్లారెడ్డిపేట, మార్చి 15 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో అబ్దుస్ సలం అనే వ్యక్తికి వెన్నెముక శస్త్ర చికిత్స విజయవంతంగా చేశామని వైద్యుడు సత్యనారాయణస్వామి శనివారం తెలిపారు. వెన్నెముక వైద్య నిపుణుడు కృష్ణ, ఎముకల వైద్యనిపుణుడు సునీల్, ఆసుపత్రి ఎండీ అభినవ్ ఆధ్వర్యంలోని వైద్యబృందం రెండు గంటలపాటు శస్త్రచికిత్సను విజయవంతంగా చేశారని పేర్కొన్నారు. కాగా, బంగ్లాదేశ్ దేశానికి చెందిన అబ్దుల్ సలం పదేళ్లుగా వెన్నెముక వ్యాధితో బాధ పడుతున్నాడని పేర్కొన్నారు.

అన్నదాతల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

- మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ స్వరూపతిరుపతిరెడ్డి



కాలువలను పరిశీలిస్తున్న మార్కెట్ కమిటీ చెర్‌పర్సన్, కాంగ్రెస్ నాయకులు

తంగళ్లపల్లి, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): అన్నదాతల సంక్షేమమే ప్రజాపాలన ధ్యేయం అని మార్కెట్ కమిటీ చైర్మన్ వేముల స్వరూప తిరుపతిరెడ్డి, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు జల్గం ప్రవీణ్‌లు అన్నారు. శుక్రవారం తంగళ్లపల్లి మండలం జిల్లెల్ల చెరువులోకి వచ్చే సాగునీటి కాలువతో పాటు దాచారం మీదుగా చిన్నలింగాపూర్ పరిసర గ్రామాలకు వచ్చే సాగునీటి కాలువలను రైతులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లడుతూ ఎల్ఎం 4, ఎల్ఎం 5 కాలువాల ద్వారా రైతులకు సాగునీరు అందించి శాశ్వత పరిష్కారం చూపిన కేకే మహేందర్ రెడ్డికి, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారయణలకు కృతజ్ఞతలు తెలిపారు. కాలువ నిర్మాణం కోసం ల్యాండ్ ఆక్వజేషన్‌లో భూమి కోల్పోతున్న రైతులకు నష్ట పరిహారం అందించే దిశగా కేకే మహేందర్‌రెడ్డి కృషి చేస్తున్నారని అన్నారు. తమ గ్రామాలకు సాగునీరు రావాలని రాత్రింబవళ్ల కష్టపడి కేసుల పాలైన రైతులకు అండగా ఉంటామని అన్నారు.

స్పీకర్, ముఖ్యమంత్రి చిత్రపటానికి క్షీరాభిషేకం..

ముఖ్యమంత్రి రేవంతర్‌రెడ్డి, స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ చిత్రపటాలకు మండలకేంద్రంలో కాంగ్రెస్ నాయకులు క్షీరాభిషేకం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు జల్గం ప్రవీణ్, మార్కెట్ కమిటి వైస్ చైర్మన్ నేరెళ్ల నర్సింగం గౌడ్, కాంగ్రెస్ నాయకులు మునిగెల రాజు, గుగ్గిళ్ల శ్రీకాంత్‌గౌడ్, ఆరేపల్లి బాలు, పొన్నాల పర్శరాములు, ఎట్టిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, పెద్దూరి తిరుపతి, చుక్క శేఖర్, ఎగుర్ల ప్రశాంత్, మెర లక్ష్మీరాజం, ఎండి ఇక్బాల్, పొన్నం లక్ష్మణ్‌గౌడ్ తదితరులు ఉన్నారు.

కాగా, మండల కేంద్రంలో శ్రీసరస్వతి శుభోదయం ఇంగ్లీషు మీడియం స్కూల్‌లో సైన్స్ వైజ్ఞానిక ప్రదర్శన నిర్వ హించారు. మార్కెట్ కమిటీ చైర్మన్ వేలుముల స్వరూప తిరుపతిరెడ్డి, ఎంఈవో రాజు, ఎంపీఓ రజనిలు అతిథులుగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో కరస్పాండెంట్ శ్రీనివాస్ యాదవ్, ప్రిన్సిపాల్ పద్మశ్రీ, బాలరాజు, మమత, గిరిజ తదితరులు పాల్గొన్నారు.

నేరెళ్ల పీహెచ్‌సీ తనిఖీ

తంగళ్లపల్లి, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): తంగళ్లపల్లి మండలం నేరెళ్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ రామకృష్ణ డాక్టర్ అనితలు ఆకస్మికంగా తనిఖీ చేశారు. పీహెచ్‌సీలో రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించారు. అలాగే ప్రోగ్రామ్స్‌పై సమీక్ష నిర్వహించారు. నేరెళ్ల పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ఆఫీజా, వైద్య సిబ్బంది ఉన్నారు.

డీటీఎఫ్ మండల అధ్యక్షుడిగా నరేందర్‌రెడ్డి

ఇల్లంతకుంట, మార్చి 15 (ఆంధ్రజ్యోతి) డీటీఎఫ్ మండల అధ్యక్షుడుగా తూముకుంట నరేందర్‌రెడ్డి ఎన్నికయ్యాడు. మండలకేంద్రంలోని ప్రాథమిక పాఠశాలలో శనివారం సర్వసభ్య సమావేశం రామేశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో జరిగింది. ప్రధానకార్యదర్శిగా సుద్దాల రమేష్, ఉపాధ్యక్షులుగా కాట్నపెల్లి స్వామిరెడ్డి, హరిప్రసాద్, సునిత, కార్యదర్శులుగా మధు, రమేష్, మధు, ఆడిట్ కమిటీ కన్వీనర్‌గా క్రిష్టారెడ్డి, సురేష్, జిల్లా కౌన్సిలర్లుగా అశోక్‌రెడ్డి, క్రిష్టారెడ్డి స్వప్న, స్వప్న, రమేష్‌రెడ్డిలు ఎన్నికయ్యారు. ఈసందర్భంగా నరేందర్‌రెడ్డి మాట్లాడుతు నూతన పీఆర్సీని వెంటనే ప్రకటించి, పెండింగ్‌లో ఉన్న డీఏలను విడుదల చేయాలన్నారు. నూతన అధ్యక్షుడికి పలువురు అభినందనలు తెలిపారు.

మహిళా రైతుల దీక్షకు బీజేపీ నాయకుల సంఘీభావం

ఇల్లంతకుంట, మార్చి 15(ఆంధ్రజ్యోతి) సాగునీటి కాలువ పనులు పూర్తిచేయాలని డిమాండ్ చేస్తు మహిళా రైతులు చేపట్టిన దీక్షకు బీజేపీ నాయకులు సంఘీభావం ప్రకటించారు. కార్యక్రమంలో బీజేపీ మండలాల అధ్యక్షులు భూమల్ల అనీల్‌కుమార్, వెన్నమనేని శ్రీధర్‌రావు, నాయకులు కొలనూరి ముత్తవ్వ, పండుగ మాధవి, ఆసాని లావణ్య, కోడం భవిత, ఆసాని రాంలింగారెడ్డి, బాలయ్య, కమలాకర్‌రావులతో పాటు రైతులు పాల్గొన్నారు.

ఆత్మీయ సమ్మేళనం విజయవంతం చేయాలి

ఎల్లారెడ్డిపేట, మార్చి15(ఆంధ్రజ్యోతి) : సిరిసిల్ల పట్టణంలో ఈనెల 16న నిర్వహించ తలపెట్టిన బీజేపీ కార్యకర్తల ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆ పార్టీ నాయకులు పిలుపునిచ్చారు. మండల కేంద్రంలో శనివారం ఆ పార్టీ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్, నూతనంగా నియమితులైన బీజేపీ జిల్లా అధ్యక్షుడు గోపి ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని నిర్వహించనున్నారని పేర్కొన్నారు. ప్రతి కార్యకర్తను గుర్తించి రాబోయే రోజుల్లో పార్టీ బలోపేతానికి పాటు పడేలా దిశానిర్ధేశం చేయనున్నారని అన్నారు. నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో తరలి వచ్చి జయప్రదం చేయాలని కోరారు. సమావేశంలో నాయకులు లక్ష్మారెడ్డి, బుగ్గారెడ్డి, పర్శరాములు, గాల్‌రెడ్డి, సంజీవరెడ్డి, నరేశ్, ఆంజనేయులు, గణేశ్, ప్రదీప్‌రెడ్డి, కిరణ్‌నాయక్, పూర్ణిమ, స్రవంతి, సుజాత తదితరులు పాల్గొన్నారు.

విధులు బహిష్కరించిన ఆశావర్కర్లు



నిరసన వ్యక్తం చేస్తున్న ఆశా వర్కర్లు

వేములవాడ, మార్చి 15 (ఆంధ్రజ్యోతి) : జగిత్యాల జిల్లాలో ఆశా వర్కర్‌పై జరిగిన అత్యాచారాన్ని నిరసిస్తూ వేములవాడ ఆశా వర్కర్లు విధులను బహిష్కరించి స్థానిక అర్బన్ హెల్త్ సెంటర్ ముందు శనివారం నాడు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ఉపాధ్యక్షుడు గుర్రం అశోక్ మాట్లాడుతూ సామాజిక సేవ చేస్తున్న ఆశా కార్యకర్తలపై అత్యాచార సంఘటన దిగ్భ్రాంతికి గురిచేసిందన్నారు. జగిత్యాల జిల్లాలో జరిగిన సంఘటనపై ప్రభుత్వం నిందితులను వెంటనే అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా తగిన భద్రత కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో ఆశావర్కర్లు మల్లీశ్వరి, పుష్పలత, ఉమా, వైష్ణవి, భాషలత, దేవి, సరిత, కవిత తదితరులు పాల్గొన్నారు.

రాజన్న దర్శనం కోసం పాదయాత్ర

వేములవాడ కల్చరల్, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): వేములవాడ శ్రీరాజరాజేశ్వర స్వామివారి దర్శనానికి భక్తులు సుమారు 20 కిలోమీటర్లు పాదయాత్రతో రాజన్న ఆలయానికి చేరుకున్నారు. రాజన్న సిరిసిల్ల జిల్లా కోనరావుపేట మండలం కొండాపూర్ గ్రామానికి చెందిన 20మంది భక్తులు శనివారం ఉదయం పాదయాత్రగా నడుచుకుంటూ వేములవాడకు చేరుకున్నారు. కోరిన కోరికలు తీర్చితే వచ్చే సంవత్సరం మళ్లీ పాదయాత్రగా వస్తామని తెలిపారు.

వరి పంట పరిశీలించిన అధికారులు

బోయినపల్లి, మార్చి 15 (ఆంధ్రజ్యోతి) : బోయినపల్లి, మండలంలోని కోరేం గ్రామంలోని రైతులు సాగు చేస్తున్న వరి పొలాలను వ్యవసాయశాఖ అధికారులు శనివారం పరిశీలించి రైతులకు పలు సూచనలు చేశారు. ఈ క్షేత్ర సందర్శనలో మండల వ్యవసాయ అధికారి ప్రణీత, ఏఈవో లక్ష్మన్ రైతులు పాల్గొన్నారు.

ఘనంగా ఫుడ్ ఫెస్టివల్

చందుర్తి మార్చి 15 (ఆంధ్రజ్యోతి) : లింగంపేట గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో ఫుడ్ ఫెస్టివల్ శనివారం నిర్వహించారు. ఏక్ భారత్ శ్రేష్ఠ భారత్ లో భాగంగా తెలంగాణ భాగస్వామ్య రాష్ట్రమైన హర్యానా రాష్ట్ర ప్రత్యేక వంటకాలతో ఈ కార్యక్రమం నిర్వహించారు. ప్రధానోపాధ్యాయులు వై.ఉమారాణి, అమ్మ ఆదర్శ పాఠశాల చైర్మన్ జయశీల, ఉపాధ్యాయులు కే.జనార్ధన్, కే.తిరుపతి, కే.సుధారాణి ఎం. లావణ్య, బి.స్వరూప రాణి, ఏ.లింగయ్య, ఎన్. సంజీవ్, గణేష్ పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణ చట్టాన్ని అసెంబ్లీలో ఆమోదించాలి

సిరిసిల్ల కలెక్టరేట్, మార్చి15 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ రాష్ట్రంలో ఎస్సీ వర్గీకరణ చట్టాన్ని అసెంబ్లీ ఆమోదించాలని ఎంఎస్‌పీ రాష్ట్ర కో-ఆర్డినేటర్ ఇంజం వెంకటస్వామి డిమాండ్ చేశారు. ఎమ్మార్పీఎస్ జాతీయ వ్యవస్థాపకులు, పద్మశ్రీ మందకృష్ణ మాదిగ ఆదేశాలమేరకు కలెక్టరేట్ ప్రధాన ద్వారం ఎదుట ఎమ్మార్పీఎస్, ఎంఎస్‌పీ జిల్లా కమిటీల ఆధ్వర్యంలో చేపట్టిన రిలేనిరహార దీక్షలు శనివారంతో 6వ రోజుకు చేరుకున్నాయి. ఈ దీక్ష శిబిరానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎంఎస్‌పీ రాష్ట్ర కో-ఆర్డినేటర్ వెంకటస్వామి మాట్లాడారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకులు ఆవునూరి ప్రభాకర్, జిల్లా కన్వీనర్ ఎలగందుల బిక్షపతి, జిల్లా కో-కన్వీనర్ సామనపెల్లి రాకేష్, తంగళ్లపల్లి మండల అధ్యక్షుడు సామనపెల్లి బాలయ్య, సిరిసిల్ల పట్టణ అధ్యక్షుడు కత్తెరపాక సంతోష్, నాయకులు మంగళి చంద్రమౌళి, అవునూరి లచ్చన్న, సిరిసిల్ల రాజనర్సు, ఎడ్లరవి, నేదూరి బాబు, మునిగే శంకర్, సామల్ల ప్రతాప్, గసికంటి కళ్యాణ్, అవునూరి ఎల్లం, అందె చంద్రయ్య, మొర్రాయిపల్లి భూమరాజు తదితరులు పాల్గొన్నారు.



రిలేనిరహార దీక్షలో పాల్గొన్న ఎమ్మార్పీఎస్ నాయకులు

● ఎల్లారెడ్డిపేట : స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఎల్లారెడ్డిపేట, వీర్నపల్లి మండలాలకు చెందిన ఎమ్మార్పీఎస్ నాయకులు శనివారం నిరసన దీక్ష చేపట్టారు. నాయకులు లక్ష్మణ్, శరవింద్, దేవయ్య, నర్సయ్య, రాజేశ్, రాజయ్య, కనకరాజు, ప్రహ్లాద్, అంజయ్య, తిరుపతి, బాలరాజు, లక్ష్మణ్, తిరుపతి, దేవరాజు తదితరులు పాల్గొన్నారు.

● ఇల్లంతకుంట : తహసీల్దార్ కార్యాయ సమీపంలో ఎమ్మార్పీఎస్ నాయకులు చేపట్టిన నిరసనదీక్ష శనివారం మూడో రోజుకు చేరింది. మండల అధ్యక్షుడు మంద రాజు మాదిగ, ఉపాధ్యక్షుడు కాసుపాక సురేష్, నాయకులు పసుల వెంకన్న, రాగటి దేవదాస్, కాసుపాక శంకర్, కాసుపాక రాములు, పసుల నర్సయ్య, పసుల బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

● చందుర్తి : మండలం కేంద్రంలో ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షులు తర్రె శంకరయ్య మాదిగ ఆధ్వర్యంలో చేస్తున్న నిరసన దీక్షలు శనివారం 5వ రోజుకు చేరుకున్నాయి. ఎమ్మార్పీఎస్ నాయకులు గుండె థామస్ మాదిగ, మండల అధ్యక్షులు తర్రే శంకరయ్య మాదిగ, లింగంపల్లి అర్జున్, దుమ్ము రమేష్, కుమ్మరి లక్ష్మణ్,సిరిసిల్ల ఆశయ్య, రాజదాస్, మల్యాల శంకర్, అక్కెనపల్లి రాజేందర్, తదితరులు పాల్గొన్నారు.

అక్రమాలపై విచారణ చేపట్టాలి

ఇల్లంతకుంట, మార్చి 15(ఆంధ్రజ్యోతి) ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కుల పంపిణీలో జరిగిన అక్రమాలపై విచారణ చేపట్టాలని జడ్పీమాజీ వైస్ చైర్మన్ సిద్దం వేణు డిమాండ్ చేశారు. మండలకేంద్రంలోని పార్టీ కార్యాలయంలో శనివారం విలేకరుల సమావేశంలో మాట్లాడుతు అనారోగ్యం బారినపడిన నిరుపేదలకు చెందవలసిన ఆర్థిక సహాయాన్ని కొంతమంది కాంగ్రెస్ నాయకులు స్వాహాచేశారని ఆరోపించారు. ఇల్లంతకుంటకు చెందిన కూనబోయిన రవికి వచ్చిన రూ 60వేల సీఎంఆర్ఎఫ్ చెక్కును రహీంఖాన్‌పేట గ్రామానికి చెందిన కత్తి రవి బ్యాంకు ఖాతాలో వేసుకొని కాంగ్రెస్ నాయకులు డ్రాచేసుకున్నారని, వల్లంపట్ల గ్రామానికి చెందిన ఎల్ శ్రీనివాస్ పేరుమీదుగా రూ 26వేలు రాగా మరో గ్రామానికి చెందిన వ్యక్తి అకౌంటులో వేసుకొని కాంగ్రెస్ నాయకుడు వాడుకున్నాడని ఆరోపించారు. ఇంత అవినీతి జరుగుతున్నా ఎమ్మెల్యే సత్యనారాయణ ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు. ఎమ్మెల్యేకు చిత్తశుద్ధి ఉంటే ఏసీబీతో విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. మండలంలో మరిన్ని అక్రమాలు వెలుగులోకి తెస్తామన్నారు. సమావేశంలో నాయకులు బొల్లం వెంకటేశం, సాదుల్, కొట్టె వెంకన్న, ఒల్లాల రవి, కూనబోయిన రఘు, దయ్యాల మహేష్, కూస నరేష్, చదువాల సత్యం, చదువాల పర్శరాం, కాసుపాక రాములు, మెండయ్యలు పాల్గొన్నారు.

ఘనంగా కాన్షీరాం జయంతి..



నివాళులు అర్పిస్తున్న నాయకులు

రుద్రంగి, మార్చి 15 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలో బహుజన్ సమాజ్ పార్టీ వ్యవస్థాపకుడు కాన్షీరామ్ జయంతిని శనివారం ఘనంగా నిర్వహించారు. కాన్షీరాం చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. రుద్రంగి బీఎస్పీ మండల అధ్యక్షులు దయ్యాల ఉదయ్, కట్కూరి శంకర్,దర్శనం గంగాధర్, పోసు తిరుపతి, కాదాస్ మహేందర్, లింగాల రవీందర్, ఎనుగందుల సతీష్, లింగాల రోహిత్, చింటు మాదిగ, దేశవేని భూమేష్, ఎనగందుల రాకేష్, అక్కెనపల్లి భూమేష్, గసకంటి విశాల్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

● ఎల్లారెడ్డిపేట : కాన్షీరాం జయంతి వేడుకలను రాచర్లగొల్లపల్లిలోని అంబేద్కర్ చైతన్య యువజన సంఘం ఆధ్వర్యంలో శనివారం రాత్రి ఘనంగా నిర్వహించారు. నాయకులు బాబు, ప్రవీణ్, సుదర్శన్, సతీష్, దేవరాజు, తదితరులు పాల్గొన్నారు.

● కోనరావుపేట : మండలంలోని సుద్దాల, ధర్మారం తదితర గ్రామాల్లో కాన్షీరాం జయంతి వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కోనరావుపేట మార్కెట్ కమిటీ చైర్మన్ కచ్చకాయల ఎల్లయ్య, ప్యాక్స్ వైస్ చైర్మన్ కాశవేణి మహేష్, ఎర్రవెల్లి నాగరాజు, మాజీ సర్పంచ్ కచ్చకాయల బాల్ రెడ్డి, ప్రజాప్రతినిధులు ఉప్పుల గంగయ్య, సుంకరి మహేష్, ఆంజనేయులు, డి.సంజీవ్, నరేష్, అంజయ్య, సురేష్, నరేష్, నరేష్, దాసు, నీరటి రవి, లింగయ్య పాల్గొన్నారు.

ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా విద్యా బోధన..

కోనరావుపేట, మార్చి 15 (ఆంధ్రజ్యోతి) : ప్రైవేట్‌కు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు కొనసాగించేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం పాఠశాలల అభివృద్ధిని పెంపొందిస్తున్నారని ఏఎంఓ బి. శైలజ అన్నారు. కోనరావుపేట మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలలో ఇంటెలిజెంట్ ఆర్టిఫికేషన్ ప్రోగ్రామ్ ద్వారా విద్యార్థుల మేధస్సును పెంపొందించేందుకు కంప్యూటర్ విద్యను ప్రారంభించి మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు అన్ని వసతులతో పాటు మంచి విద్యను అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ మురళి నాయక్, హెచ్ఎంలు రాజేశం, మదన్‌లాల్, ఉపాధ్యాయులు విజయ్ కుమార్, భాస్కర్, రాము, వెంకటేశం, సంజీవ్, శృతి, అనూష, సింగిల్ విండో డైరెక్టర్ రమేష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



కంప్యూటర్ రూమును ప్రారంభిస్తున్న ఏఎంఓ శైలజ

● తంగళ్లపల్లి : తంగళ్లపల్లి మండలం తాడూరు ప్రభుత్వ ప్రాథమీక పాఠశాలలో ఆర్టిఫీషియల్ ఇంటెలిజెంట్ టెక్నాలజీతో సహాయంతో విద్యార్థులకు కంప్యూటర్ తరగతుల బోధనను హెచ్ఎం బూర రవీందర్ ప్రారంభించారు. జిల్లాలో 11 పాఠశాలలో ఆర్టిఫీషియల్ ఇంటెలిజెంట్ టెక్నాలజీ బోధనకు ఎంపిక చేసినట్లు దీంట్లో భాగంగా తంగళ్లపల్లి మండలం తాడురు, బద్దనపల్లి పాఠశాలలు ఎంపిక కాగా శుక్రవారం తరగతులను ప్రారంభించారు. చదువులో వెనకబడిన ప్రాథమీక పాఠశాల విద్యార్థులకు వారి సామర్థ్యాల ఆధారంగా నేర్చుకోవాలడానికి ఈ ఆర్టిఫీషియల్ ఇంటెలిజెంట్ టెక్నాలజీ కంప్యూటర్ తరగతులు ఎంతగానో ఉపయోగ పడతాయని ఈ సందర్భంగా హెచ్ఎం అన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు తల్లిదండ్రులు పాల్గొన్నారు.

● ఎల్లారెడ్డిపేట : ప్రాథమిక స్థాయి లోనే విద్యార్థులకు కృత్రిమ మేధస్సు ద్వారా విద్యా బోధన కల్పించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని వెంకటాపూర్ కాంప్లెక్స్ హెచ్ఎం కృష్ణహరి అన్నారు. ఎల్లారెడ్డిపేట మండలం దుమాలలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు ఏఐ ఏఎక్స్ఎల్ ఫర్ ఎఫ్ఎల్ఎస్ కార్యక్రమాన్ని శనివారం ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో హెచ్ఎంలు రామచంద్రం, గంగయ్య, ఉపాధ్యాయులు అరుణ, మౌలానా, అంజనేయులు, సతీష్, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తే చట్టపరమైన చర్యలు

వేములవాడ, మార్చి 15 (ఆంధ్రజ్యోతి) : లింగ నిర్ధారణ పరీక్షలు నిర్వహించడం చట్టపరంగా నేరమని వైద్యాధికారి సంపత్ కుమార్ అన్నారు. వేములవాడ పట్టణంలోని పలు స్కానింగ్ సెంటర్లలో వైద్యాధికారుల బృందం శనివారం నాడు తనిఖీలు నిర్వహించింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్, కలెక్టర్ ఆదేశాలతో వేములవాడ పట్టణంలోని పలు ప్రైవేట్ స్కానింగ్ సెంటర్లను తనిఖీలు నిర్వహించామని తెలిపారు. గర్భస్థ పిండ, లింగ నిర్ధారణ పరీక్షలు చేయడం చట్టరీత్యా నేరమని నిర్వాహకులకు సూచించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో హెచ్ ఈ. బాలయ్య, డిఇఓ మహేశ్ పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై రైతులు అప్రమత్తంగా ఉండాలి

తంగళ్లపల్లి, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): పశువులకు వచ్చే సీజనల్ వ్యాధుల పట్ల రైతులు అప్రమత్తంగా ఉండాలని మార్కెట్ కమిటి చైర్మన్ వేముల స్వరూప తిరుపతిరెడ్డి అన్నారు. శుక్రవారం తంగళ్లపల్లి మండలం నేరెళ్ల గ్రామంలో సిరిసిల్ల మార్కెట్ కమిటి అధ్వర్యంలో ఏర్పాటు చేసిన పశు వైద్య శిబిరాన్ని మార్కెట్ కమిటి చైర్మన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లడుతూ పశువులకు ఇచ్చే వాక్సినేషన్‌ను సకాలంలో ఇప్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటి వైస్ చైర్మన్ నేరెళ్ల నర్సింగం గౌడ్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు జల్గం ప్రవీణ్, మార్కెట్ కమిటి డైరెక్టర్లు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

ఎల్ఆర్ఎస్‌ను సద్వినియోగం చేసుకోవాలి

రుద్రంగి, మార్చి 15(ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం రాయితీ కల్పిస్తున్న ఎల్ఆర్ఎస్ పథకాన్ని మండల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీవో సుధాకర్ కోరారు. మండల కేంద్రంలో శనివారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఎల్ఆర్ఎస్ 2020నాటికి దరఖాస్తు చేసుకున్న ఇంటిస్థలాల, ప్లాట్ల యజమానులకు రాష్ట్ర ప్రభుత్వం జీవో ఎంఎస్ 28 ద్వారా తేది 31 మార్చి 2025 లోపు 25 శాతం మినహాయింపు రాయితీతో క్రమబద్ధీకరణ చేసుకోవాలని కోరారు. గడువులోపు చెల్లించిన ఇంటిస్థలాలకు, ప్లాట్లకు ఇంటినిర్మాణ అనుమతులు, బ్యాంక్ లోన్లు సులభంగా వస్తాయన్నారు. మండలంలో 298 దరఖాస్తులు రాగా, అందులో 239 అప్రూవల్ కాగా, పది మంది మాత్రమే రుసుం చెల్లించారన్నారు. మిగతావారు ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకొని ఎల్ఆర్ఎస్ చెల్లించాలని కోరారు.

పలువురికి ఘన సన్మానం

ఎల్లారెడ్డిపేట, మార్చి 15 (ఆంధ్రజ్యోతి) : ఎల్లారెడ్డిపేట మండలం నారాయణపూర్, రాచర్లగొల్లపల్లి గ్రామాల్లో ఇటీవల నూతనంగా ఎన్నికైన రెడ్డి సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు గుండారపు కృష్ణారెడ్డి, ఉపాధ్యక్షుడు గుల్లపల్లి నర్సింహారెడ్డి, ఆర్ఎంపీ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు పాతూరి ప్రవీణ్‌రెడ్డిలను రెడ్డిసంఘం సభ్యులు, తాజా, మాజీ ప్రజాప్రతినిధులు, పలువురు నాయకులు శనివారం వేర్వేరుగా సన్మానించారు. నారాయణపూర్‌లో కృష్ణారెడ్డి, నర్సింహారెడ్డిలను రెడ్డి సంఘం సభ్యులు పూలమాలలు, సత్కరించారు. గొల్లపల్లిలో ప్రవీణ్‌రెడ్డిలను పలువురు సన్మానించారు. కార్యక్రమంలో రెడ్డి సంఘం సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.